


PRGI NO: TGTEL/25/A5314

# అర్జున్ సమాచారం

www.arjunsamaachaaram.in

తెలుగు దినపత్రిక

ఎడిటర్ : లింగం రాజయ్య

బ్యూరో చీఫ్ : గిరవెన రాకేష్








నల్లగొండ హైదరాబాద్ రంగారెడ్డి | epaper.arjun saamaacharam.com | శనివారం 11, జులై 2026 | సంపుటి :1 సంచిక : 189 | పేజీలు : 8 , వెల.2.00




2

కరూర్ తొక్కిసలాట ఘటన..

## సీఎం విజయ్ సంచలన కామెంట్లు..

తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ కరూర్‌లో పర్యటించారు. తొక్కిసలాట ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబీకులకు ఉద్యోగ పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఎం విజయ్ మాట్లాడుతూ.. కరూర్ ఘటన తనను ఎంతో బాధించిందని అన్నారు. ఈ ఘటనను డీఎంకే పార్టీ రాజకీయం చేసిందంటూ మండిపడ్డారు.

# 2028 డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగవు

### 2029 జూన్‌లో ఎన్నికలు జరుగుతాయని సీఎం జోస్యం

### అప్పటికీ అసెంబ్లీ స్థానాలు 119 నుంచి 182కు పెరుగుతాయని వెల్లడి

### పార్లమెంట్ స్థానాలు 17 నుంచి 25కు పెరుగుతాయని వివరణ

### జరగబోయే కురుక్షేత్రంలో గెలిచేది మేమే బీఆర్ఎస్‌కు సవాల్

### కన్నెపల్లి పంప్‌హౌస్‌లు ఆన్ చేస్తే గ్రామాలు కొట్టుకుపోతాయని వెల్లడి

2028 డిసెంబర్‌లో ఎన్నికలు జరగవని, నియోజకవర్గాల పునర్విభజన అనంతరం 2029 జూన్‌లో ఎన్నికలు జరుగుతాయని సీఎం రేవంత్ జోస్యం చెప్పారు. అప్పటికీ అసెంబ్లీ స్థానాలు 119 నుంచి 182కు, పార్లమెంట్ స్థానాలు 17 నుంచి 25కు పెరుగుతాయని అన్నారు. 182 స్థానాల్లో కనీసం 117 స్థానాల్లో కాంగ్రెస్ గెలిచి రెండోసారి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ 65 సీట్లు గెలుస్తుందని తాము ముందే చెప్పి చేసి చూపించామని గుర్తు చేశారు. ఖమ్మం జిల్లా జగన్నాథపురంలో నిర్వహించిన రైతు ఆశీర్వాద సభలో శుక్రవారం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.బీఆర్ఎస్, ఆ పార్టీ అధినేత కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.



2 లో..





2

సుప్రీంకోర్టులో ఊహించని ఘటన..

## న్యాయమూర్తులపై ఆగ్రహించిన పిటిషనర్..

సుప్రీంకోర్టులో ఇవాళ (శుక్రవారం) అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఓ కేసు విచారణ సందర్భంగా పిటిషనర్ న్యాయమూర్తులపై తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డాడు. దీంతో కోర్టు హాలులో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అనంతరం నిందితుడు చేతిలో ఉన్న కేసు పత్రాల కట్టను న్యాయమూర్తుల డయాస్ వైపు విసిరేయడంతో భద్రతా అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు.

నాలుగు దశాబ్దాల తర్వాత

## సరికొత్త చరిత్ర..

### న్యూజిలాండ్‌లో అడుగుపెట్టిన ప్రధాని మోదీ!



భారత విదేశాంగ విధానంలో మరో కీలక అధ్యాయం మొదలైంది. ఆస్ట్రేలియాలో అత్యంత విజయవంతమైన పర్యటనను ముగించుకున్న భారత ప్రధాని నరేంద్ర మోదీ.. ఇవాళ (శుక్రవారం) న్యూజిలాండ్‌లోని ఆక్లాండ్ నగరానికి చేరుకున్నారు. గత నాలుగు దశాబ్దాలలో ఒక భారత ప్రధాని న్యూజిలాండ్‌లో పర్యటించడం ఇదే తొలిసారి కావడం విశేషం. న్యూజిలాండ్ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సన్ ఆహ్వానం మేరకు ప్రధాని మోదీ ఈ పర్యటనకు విచ్చేశారు. విమానాశ్రయానికి చేరుకున్న మోదీకి పీఎం లక్సన్ ఆత్మీయంగా కౌగిలించుకుని సాదర స్వాగతం పలికారు.

కాంగ్రెస్ నేతలకు

## కంటి పరీక్షలు చేయించాలి



తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, ఎంఐఎం పార్టీని లక్ష్యంగా చేసుకుని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఘాటు విమర్శలు చేశారు. ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీకి చెందిన ఫాతిమా మహిళా కళాశాల.. సకలం చెరువు పరిధిలో ఉందని బండి సంజయ్ మరోసారి ఆరోపించారు.

వార్త 2లో



2

డిసెంబర్‌లో స్వదేశానికి

## వెళతాను.. బంగ్లాదేశ్ మాజీ ప్రధాని హసీనా

డిసెంబర్‌లో తాను స్వదేశానికి తిరిగెళ్లాలని అనుకుంటున్నట్లు బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, అవామీ లీగ్ అధినేత్రి షేక్ హసీనా తాజాగా తెలిపారు.

## హరీశ్ కాంగ్రెస్‌లోకి వస్తానంటే చర్చిస్తాం: మహేశ్ కుమార్

మూడు నెలలు నీటిపారుదల మంత్రిగా అవకాశం ఇస్తే నీటి సమస్యను పరిష్కరించి చూపిస్తానంటూ బీఆర్ఎస్ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు.



2

## కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలిసిన బీఆర్ఎస్ నేతల బృందం..

**ఢిల్లీ:**

కేంద్ర ఎన్నికల సంఘాన్ని(ఈసీఐ) బీఆర్ఎస్ నేతల బృందం కలిసింది. ఇవాళ (శుక్రవారం) ఢిల్లీకి చేరుకున్న నేతలంతా సర్( ప్రక్రియపై ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే తెలంగాణలో డబుల్, డూప్లికేట్ ఓట్ల తొలగింపు వంటి అంశాలను ఈసీఐ దృష్టికి తీసుకెళ్లారు. ఈసీఐని కలిసిన వారిలో బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, పార్టీ ప్రధాన కార్యదర్శి సోమా భరత్ ఉన్నారు.ఈ సందర్భంగా తెలంగాణ ఓటర్ జాబితాలో ఉన్న డబుల్, డూప్లికేట్ ఓట్లను గుర్తించి వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని కోరారు. అలాగే ఓటర్ గుర్తింపు కార్డును ఆధార్‌తో అనుసంధానం చేయడం ద్వారా నకిలీ, డూప్లికేట్ ఓట్ల సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని సూచించారు. అదే సమయంలో ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపైనా పలు సూచనలు చేసినట్లు బీఆర్ఎస్ నేతలు వెల్లడించారు.

అర్జున్ సమాచారమ్

# ఆయిల్ పామ్ సాగు వైపు మొగ్గు చూపండి..

### ఎల్‌నినో రాబోతోంది.. తీవ్ర కరవు కాటకాలు వచ్చే ప్రమాదం

### రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలి

### ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పించాలి

### రైతులకు మంత్రి పొన్నం విజ్ఞప్తి

సిద్దిపేట జిల్లా, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి



ఆయిల్ పామ్ సాగు పెంచడానికి 5 ఎకరాలపైన ఉన్న రైతులతో సమావేశం ఏర్పాటు చేశామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈరోజు(శుక్రవారం) హుస్నాబాద్ నియోజకవర్గం అక్కన్నపేట మండలం జనగామ గ్రామంలో మెగా పామ్ ఆయిల్ ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి ఆయిల్ పామ్ మొక్కలు నాటారు. అనంతరం మంత్రి పొన్నం మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ డిమాండ్‌కి తగ్గ ఉత్పత్తి లేదని.. రైతులు ఆ సాగు వైపు మొగ్గు చూపాలని కోరారు. నర్మేటలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించినట్లు తెలిపారు. జిల్లాలో 50 వేల ఎకరాలు ఆయిల్ పామ్ సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని.. ఇప్పుడు 14 వేల ఎకరాలకు పైగా సాగు జరుగుతోందని మంత్రి తెలిపారు. ఒక్కో చిన్న గ్రామంలో 100 ఎకరాల ఆయిల్ పామ్ సాగు దాటిస్తే రూ.5 లక్షలు, పెద్ద గ్రామాల్లో 200 ఎకరాలపైన సాగు ప్రోత్సహిస్తే రూ.10 లక్షల అభివృద్ధి ప్రోత్సాహకాలు అందిస్తామని వెల్లడించారు. ఎల్‌నినో రాబోతోందని.. తీవ్ర కరవు కాటకాలు వర్షాభావ పరిస్థితులు ఉంటాయని మంత్రి తెలిపారు. దీంతో రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగు ద్వారా కోతుల బెడద ఉండదని.. వాతావరణ మార్పుల ఇబ్బంది ఉండదని చెప్పుకొచ్చారు. రాజకీయాలకు అతీతంగా రైతాంగం గురించి ఆలోచించే వారు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పించాలని పొన్నం ప్రభాకర్ సూచించారు.

#### దేశానికి ఆయిల్ పామ్ అత్యవసరం: వివేక్

దేశానికి ఆయిల్ పామ్ అత్యవసరమని మంత్రి వివేక్ వెంకట స్వామి అన్నారు. ఇరాన్ యుద్ధం వల్ల ధరలు పెరుగుతున్నాయని.. ఆయిల్ పామ్ దిగుమతి చేసుకుంటే ఇబ్బందులు తప్పవని.. అందుకోసం సొంతంగా ఉత్పత్తి పెంచాలని కోరారు. గత సంవత్సరం కాళేశ్వరం ప్రాజెక్ట్ లేనప్పటికీ 25 శాతం అదనంగా వడ్లు కొనుగోలు చేయడం జరిగిందని చెప్పారు. ఆయిల్ పామ్‌కు పెద్దగా నీళ్లు అవసరం లేదన్నారు. చెన్నూరులో కూడా ఆయిల్ పామ్ సాగు వైపు చూస్తున్నారన్నారు '100 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేసిన గ్రామాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ రూ.5 లక్షలు ప్రోత్సాహకం ఇస్తే.. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా నేను కూడా రూ.5 లక్షలు ఇస్తాను' అని మంత్రి వివేక్ ప్రకటించారు.

## నాలుగు దశాబ్దాల తర్వాత సరికొత్త చరిత్ర..

### న్యూజిలాండ్‌లో అడుగుపెట్టిన ప్రధాని మోదీ!

ఆక్లాండ్ (న్యూజిలాండ్), అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

భారత విదేశాంగ విధానంలో మరో కీలక అధ్యాయం మొదలైంది. ఆస్ట్రేలియాలో అత్యంత







విజయవంతమైన పర్యటనను ముగించుకున్న భారత ప్రధాని నరేంద్ర మోదీ.. ఇవాళ (శుక్రవారం) న్యూజిలాండ్‌లోని ఆక్లాండ్ నగరానికి చేరుకున్నారు. గత నాలుగు దశాబ్దాలలో ఒక భారత ప్రధాని న్యూజిలాండ్‌లో పర్యటించడం ఇదే తొలిసారి కావడం విశేషం. న్యూజిలాండ్ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సన్ ఆహ్వానం మేరకు ప్రధాని మోదీ ఈ పర్యటనకు విచ్చేశారు. విమానాశ్రయానికి చేరుకున్న మోదీకి పీఎం లక్సన్ ఆత్మీయంగా కౌగిలించుకుని సాదర స్వాగతం పలికారు.

#### ద్వైపాక్షిక బంధానికి సరికొత్త ఊపు

ఈ పర్యటనలో భాగంగా ఇరు దేశాల ప్రధానులు ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. గత రెండేళ్లుగా భారత్-న్యూజిలాండ్ మధ్య వాణిజ్యం, రక్షణ రంగాలలో అద్భుతమైన ప్రగతి కనిపిస్తోంది. ముఖ్యంగా ఈ ఏడాది ఏప్రిల్‌లో కుదిరిన 'సమగ్ర స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం' (ఖీతీవవ ןతీఘునవ ాూస్త్రతీవవఎవత్) తర్వాత ఇరు దేశాల మధ్య సంబంధాలు మరింత బలోపేతం అయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ పర్యటన ద్వైపాక్షిక సంబంధాలకు మరింత ఊపునిస్తుందని విదేశాంగ మంత్రిత్వ శాఖ (వీజూూ) తెలిపింది.

## సుప్రీంకోర్టులో ఊహించని ఘటన.. న్యాయమూర్తులపై ఆగ్రహించిన పిటిషనర్..

న్యూఢిల్లీ: అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

సుప్రీంకోర్టులో ఇవాళ (శుక్రవారం) అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఓ కేసు విచారణ సందర్భంగా పిటిషనర్ న్యాయమూర్తులపై తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డాడు. దీంతో కోర్టు హాలులో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అనంతరం నిందితుడు చేతిలో ఉన్న కేసు పత్రాల కట్టను న్యాయమూర్తుల డయాస్ వైపు విసిరేయడంతో భద్రతా అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. పిటిషనర్‌ను బలవంతంగా కోర్టు హాలు నుంచి బయటకు తీసుకెళ్లారు. ఈ ఘటన న్యాయమూర్తులు జస్టిస్ కేవీ విశ్వనాథన్, జస్టిస్ అలోక్ అరాధే ధర్మాసనం కేసు విచారణ చేస్తున్న సమయంలో జరిగింది. అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఓ తీర్పును సవాల్ చేస్తూ పిటిషనర్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. నేడు విచారణ సందర్భంగా స్వయంగా హాజరై తన వాదనలు వినిపించే క్రమంలో అసాధారణంగా దూకుడుగా ప్రవర్తించాడు. వాదనలు ప్రారంభించిన వెంటనే 'లక్నో ఏసీపీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని నేను ఆదేశిస్తున్నా' అంటూ న్యాయమూర్తులను ఉద్దేశించి వ్యాఖ్యానించాడు. దీంతో ఆశ్చర్యానికి గురైన జస్టిస్ కేవీ విశ్వనాథన్.. 'మీరు మమ్మల్ని ఆదేశిస్తున్నారా?' అని ప్రశ్నించారు. దీనికి స్పందించిన పిటిషనర్ 'నా తరఫున చెప్పాల్సిందంతా చెప్పాను. అన్నీ రికార్డులో ఉన్నాయి' అని పేర్కొన్నాడు. అనంతరం ఒక్కసారిగా ఆగ్రహానికి లోనై కేసు పత్రాలను గాల్లోకి విసిరేయడంతో పాటు, కోర్టు హాలులోనే న్యాయమూర్తులను ఉద్దేశించి అసభ్య పదజాలంతో దూషించాడు. దీంతో అక్కడే ఉన్న భద్రతా సిబ్బంది వెంటనే స్పందించి పిటిషనర్‌ను అదుపులోకి తీసుకుని కోర్టు హాలు నుంచి బయటకు తరలించారు. ఈ ఘటనతో కొద్దిసేపు కోర్టు హాలులో కలకలం రేగింది. అయినా న్యాయమూర్తులు ఏమాత్రం సహనం కోల్పోకుండా విచారణను కొనసాగించడం విశేషం.

## కాంగ్రెస్ నేతలకు కంటి పరీక్షలు చేయించాలి: కేంద్ర మంత్రి బండి సంజయ్

హైదరాబాద్: అర్జున్ సమాచారమ్ ప్రతినిధి


తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, ఎంఐఎం పార్టీని లక్ష్యంగా చేసుకుని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఘాటు విమర్శలు చేశారు. ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీకి చెందిన ఫాతిమా మహిళా కళాశాల.. సకలం చెరువు పరిధిలో ఉందని బండి సంజయ్ మరోసారి ఆరోపించారు. ఇది ప్రపంచమంతా చూస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం చూడనట్లు నటిస్తోందని ఆయన మండిపడ్డారు. పేదల ఇళ్లను హైడ్రా (న్ణ=ూూూ) పేరుతో కూల్చివేస్తున్న ప్రభుత్వం.. అందరికీ కనిపిస్తున్న ఈ ఆక్రమణను మాత్రం ఎందుకు గుర్తించలేకపోతోందని ప్రశ్నించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా బండి సంజయ్ పోస్టు పెట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులకు వెంటనే కంటి పరీక్షలు చేయించాల్సిన అవసరం ఉందంటూ బండి సంజయ్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కాంగ్రెస్ నేతల కోసం రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ కార్యకర్తలు ఉచిత కంటి పరీక్షా శిబిరాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఆ పరీక్షల తర్వాత కూడా వారికి చెరువు పక్కన కళాశాల కనిపించకపోతే సమస్య కళ్లలో కాదు.. వారి రాజకీయాల్లోనే ఉందని అర్థం చేసుకోవాలన్నారు. మరోవైపు హైడ్రా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ఆటలాడుతోందన్నారు. కాంగ్రెస్ ఎక్కడ రాజకీయ రంగోలి వేయాలనుకుంటే అక్కడ ఫుల్ ట్యాంక్ లెవల్ (ఖీూ) గీతలు వారి మిత్రులకు అనుకూలంగా మారిపోతున్నాయంటూ తీవ్ర విమర్శలు గుప్పించారు. అధికార పార్టీ తనకు అనుకూలంగా వ్యవస్థలను వినియోగిస్తోందని కేంద్ర మంత్రి ఆరోపించారు. కాగా, సకలం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఒవైసీ కాలేజీ ఉందనే అంశంపై ఇటీవల రాజకీయంగా చర్చ జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా బండి సంజయ్ చేసిన పోస్టు.. తెలంగాణ రాజకీయాల్లో మరోసారి దుమారం రేపే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## కరూర్ తొక్కిసలాట ఘటన.. సీఎం విజయ్ సంచలన కామెంట్లు..

ఇంటర్‌నెట్ డెస్క్: అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ కరూర్‌లో పర్యటించారు. తొక్కిసలాట ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబీకులకు ఉద్యోగ పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఎం విజయ్ మాట్లాడుతూ.. కరూర్ ఘటన తనను ఎంతో బాధించిందని అన్నారు. ఈ ఘటనను డీఎంకే పార్టీ రాజకీయం చేసిందంటూ మండిపడ్డారు. తొక్కిసలాటకు తనను బాధ్యుడిని చేయాలని డీఎంకే విశ్వ ప్రయత్నం చేసిందని పేర్కొన్నారు. తనకు ప్రజలే ముఖ్యమని, డబ్బు కాదని స్పష్టం చేశారు. ఇప్పుడు కూడా ప్రజల కోసమే కరూర్‌కు వచ్చానని చెప్పారు. ఆయన తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. 'ఘటన జరిగిన రోజు ఎవరు ఆదేశాలు ఇచ్చారు?.. ఎవరు బాధ్యులు?. కరూర్ పోలీసులను నేను నమ్మాను. దానివల్ల నన్ను నమ్మినవారిని కోల్పోయా. పోలీసులు నన్ను కరూర్‌లో ప్రవేశించకుండా అడ్డుకుని ఉండొచ్చు. కానీ, వాళ్లు అలా చేయలేదు. సభను రద్దు చేసే అన్ని హక్కులు వారికి ఉన్నాయి. కానీ, వాళ్లు రద్దు చేయలేదు. పైగా నన్ను లోపలికి రానిచ్చారు. ఈ సంఘటనకు నిజమైన బాధ్యులు ఎవరు? ఎవరు చేశారిదంతా?'..'నేను ఇంట్లో బాధతో అల్లాడిపోతున్న సమయంలో దారుణంగా విమర్శించారు. ఇంట్లో దాక్కున్నానని అన్నారు. సరిపడా పోలీసులను బందోబస్తు కోసం పంపలేదు?. కానీ, సిగ్గులేకుండా నన్ను నిందిస్తున్నారు. ఎమ్‌కే స్టాలిన్ అసెంబ్లీలో దీనిపై రాజకీయాలు చేశారు. నా రాజకీయ ప్రత్యర్థులు, పోలీసులు కలిసి కరూర్ తొక్కిసలాటకు కారణమయ్యారు. తమిళనాడును డీఎంకే, ఏఐఏడీఎంకే పార్టీలు దోచుకున్నాయి. ఇకపై ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు ఉండవు' అని అన్నారు.





## 2028 డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగవు

### 2029 జూన్‌లో ఎన్నికలు జరుగుతాయని సీఎం జోస్యం

### అప్పటికీ అసెంబ్లీ స్థానాలు 119 నుంచి 182కు పెరుగుతాయని వెల్లడి

### పార్లమెంట్ స్థానాలు 17 నుంచి 25కు పెరుగుతాయని వివరణ

### జరగబోయే కురుక్షేత్రంలో గెలిచేది మేమే బీఆర్ఎస్‌కు సవాల్

### కన్నెపల్లి పంప్‌హౌస్‌లు ఆన్ చేస్తే గ్రామాలు కొట్టుకుపోతాయని వెల్లడి

2028 డిసెంబర్‌లో ఎన్నికలు జరగవని, నియోజకవర్గాల పునర్విభజన అనంతరం 2029 జూన్‌లో ఎన్నికలు జరుగుతాయని సీఎం రేవంత్ జోస్యం చెప్పారు. అప్పటికీ అసెంబ్లీ స్థానాలు 119 నుంచి 182కు, పార్లమెంట్ స్థానాలు 17 నుంచి 25కు పెరుగుతాయని అన్నారు. 182 స్థానాల్లో కనీసం 117 స్థానాల్లో కాంగ్రెస్ గెలిచి రెండోసారి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ 65 సీట్లు గెలుస్తుందని తాము ముందే చెప్పి చేసి చూపించామని గుర్తు చేశారు. ఖమ్మం జిల్లా జగన్నాథపురంలో నిర్వహించిన రైతు ఆశీర్వాద సభలో శుక్రవారం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్, ఆ పార్టీ అధినేత కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "కేసీఆర్ ఇంట్లో ఒకరంటే ఒకరికి పడదు. కల్వకుంట్ల కౌరవ కుటుంబాన్ని పాతాళానికి తొక్కుతాం. పాపాల భైరవుడిని ఫామ్‌హౌస్‌లో బంధించాం. కాచుకో చంద్రశేఖర్ రావు.. జరగబోయే కురుక్షేత్రంలో గెలిచేది మేమే" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్‌ను మళ్లీ మొలకెత్తనివ్వబోమని ప్రజలు సంకల్పించారని, పదేళ్ల రాక్షస పాలనకు ఇప్పటికే ముగింపు పలికారన్నారు. మరోవైపు బీఆర్ఎస్‌లో ఉంటారో లేదో హరీశ్ రావే చెప్పాలి అన్నారు. బీజేపీతో మంతనాలు జరపడం లేదా అని ప్రశ్నించారు. రైతు ఆశీర్వాద సభలో భాగంగా 1.44 లక్షల మంది రైతులకు రూ.1,009 కోట్ల రైతు భరోసా నిధులను సీఎం విడుదల చేశారు. కన్నెపల్లి పంప్‌హౌస్‌లను ప్రారంభించాలని బీఆర్ఎస్ నేతలు చేస్తున్న డిమాండ్‌ను ఆయన తప్పుబట్టారు. అలా చేస్తే భద్రాచలం రామాలయం సహా 44 గ్రామాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ఉచిత విద్యుత్ కాంగ్రెస్ పేటెంట్ అని పేర్కొన్న రేవంత్.. "ఇప్పుడు వైర్లు పట్టుకుంటే కాలి బూడిదైపోతారు" అని వ్యాఖ్యానించారు.

## హరీశ్ కాంగ్రెస్‌లోకి వస్తానంటే చర్చిస్తాం: మహేశ్ కుమార్

హైదరాబాద్, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

మూడు నెలలు నీటిపారుదల మంత్రిగా అవకాశం ఇస్తే నీటి సమస్యను పరిష్కరించి చూపిస్తానంటూ బీఆర్ఎస్ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. ఈరోజు(శుక్రవారం) మీడియాతో మాట్లాడుతూ.. హరీశ్ రావు నిజంగా కాంగ్రెస్‌లోకి వస్తానంటే పార్టీలో చర్చిస్తామన్నారు. పొలిటికల్ ఎఫైర్స్ కమిటీలో చర్చించి హరీశ్‌ను చేర్చుకోవాలా? వద్దా? అని నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. పదేండ్లు ఏం చేయని వారు మూడు నెలల సమయంలో ఏం చేస్తారని అన్నారు. గత ప్రభుత్వ అప్పులు, తప్పులను సరి చేస్తున్నామని మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు.



#### కాంగ్రెస్ పార్టీలో అంతర్గత గొడవలపై..

కాంగ్రెస్ పార్టీలో అంతర్గత గొడవలపై మహేశ్ స్పందిస్తూ.. కాంగ్రెస్ పార్టీలో భిన్నాభిప్రాయాలు సహజమన్నారు. మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. తుంగతుర్తి సమస్య కూడా పరిష్కారం అవుతుందని చెప్పారు. ఇరు వర్గాల వాదనలు వింటామన్నారు. పార్టీలో అందరూ సమానమే అని తేల్చిచెప్పారు. క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బిజీగా ఉండడం వల్ల ఇద్దరు సీనియర్ నాయకులను సమస్య పరిష్కారం కోసం నియమించామని అన్నారు. సస్పెండ్ చేయడమే పరిష్కారం కాదన్నారు. ప్రభుత్వాన్ని కూలగొడతామని అన్నప్పుడు.. పది మంది ఎమ్మెల్యేలు తమకు మద్దతు ఇచ్చారని చెప్పారు. నీళ్ల దోపిడీ జరిగినప్పుడు ఈటల మంత్రిగా ఉన్నారని మహేశ్ గుర్తుచేశారు.

# కళాకారుల ఆరోగ్యం, సంక్షేమం కూడా ముఖ్యమే

### కళాకారులతో మాట్లాడినప్పుడు వారి ఆరోగ్య సమస్యలు గుర్తించా

### అందుకే వారి ఆరోగ్యం కోసం ఉచిత వైద్య చికిత్స ఏర్పాటు చేశా

### ఎక్స్ వేదికగా డిప్యూటి సిఎం పవన్ కల్యాణ్ వెల్లడి

**అమరావతి,**

సంప్రదాయ కళలను పరిరక్షించడం అంటే వాటిని ప్రోత్సహించడం మాత్రమే కాదని, వాటిని జీవనాధారంగా చేసుకున్న కళాకారుల ఆరోగ్యం, సంక్షేమాన్ని కాపాడటం కూడా ప్రభుత్వ బాధ్యత అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ హస్తకళా మహోత్సవం సందర్భంగా హస్తకళాకారులు, చేనేత కార్మికులతో మాట్లాడిన సమయంలో వారు ఎదుర్కొంటున్న వృత్తి సంబంధిత ఆరోగ్య సమస్యలు తన దృష్టికి వచ్చాయని ఆయన పేర్కొన్నారు. ఎక్స్ వేదికగా పవన్ కల్యాణ్ స్పందిస్తూ.. హస్తకళా మహోత్సవం సందర్భంగా హస్తకళాకారులు, చేనేత కార్మికులతో ఆత్మీయంగా మమేకమయ్యే అవకాశం లభించిందన్నారు. వారి అసాధారణ నైపుణ్యం, అపారమైన ఓర్పు, వృత్తిపట్ల ఉన్న అంకితభావం ఎంతో ఆకట్టుకున్నాయన్నారు. ఏళ్ల తరబడి కష్టపడి పనిచేస్తున్న కళాకారులు వెన్ను, మెడ, కీళ్ల నొప్పులు, కంటి సమస్యలు, శ్వాస సంబంధిత ఇబ్బందులు వంటి అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను తమ చేతుల మీద మోస్తున్న కళాకారుల ఆరోగ్యాన్ని కాపాడటం కూటమి ప్రభుత్వ బాధ్యత అని బలంగా విశ్వసిస్తున్నట్లు చెప్పారు. కళాకారుల సమస్యలను తెలుసుకున్న వెంటనే సంబంధిత అధికారులను ఆదేశించి రాష్ట్రంలోని వివిధ హస్తకళా, చేనేత కళాకారుల క్లస్టర్లలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించేలా చర్యలు తీసుకున్నామని డిప్యూటీ సీఎం వెల్లడించారు. తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి కలంకారీ కళాకారులు, పశ్చిమ గోదావరి జిల్లాలోని సీతారాంపురం క్రోషే లేస్ కళాకారుల కోసం నిన్న(జులై 8న) వైద్య శిబిరాలు విజయవంతంగా నిర్వహించినట్లు పవన్ చెప్పారు. ఈరోజు(గురువారం)జులై 9న ఎన్టీఆర్



జిల్లాలోని కొండపల్లి బొమ్మల కళాకారులు, కాకినాడ జిల్లాలోని ఉప్పాడ చేనేత కార్మికులు, కడప జిల్లాలోని మాధవరం చేనేత కార్మికులు, అనంతపురం జిల్లాలోని యాడికి చేనేత కార్మికుల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ÷ులై 10న విజయనగరం జిల్లాలోని బొబ్బిలి వీణ కళాకారులు, అనకాపల్లి జిల్లాలోని ఎటికొప్పాక కళాకారులు, ఏలూరు జిల్లాలోని హ్యాండ్ నాటెడ్ వూలెన్ పైల్ కార్పెట్ కళాకారులు, మదనపల్లె చేనేత కార్మికుల కోసం వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అలాగే, జులై 11న సత్యసాయి జిల్లాలోని ధర్మవరం చేనేత కార్మికులు, శ్రీకాకుళం జిల్లాలోని బుడితి ఇత్తడి కళాకారులు, కృష్ణా జిల్లాలోని పెడన బ్లాక్ కలంకారీ కళాకారులు, తిరుపతి జిల్లాలోని చెక్క శిల్ప కళాకారుల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఎపీలోని మరిన్ని హస్తకళా, చేనేత కళాకారుల క్లస్టర్లలో ఇదే తరహాలో వైద్య శిబిరాలను దశలవారీగా కొనసాగిస్తామని పవన్ చెప్పారు. ఈ శిబిరాల ద్వారా సాధారణ ఆరోగ్య పరీక్షలతో పాటు అవసరమైన చోట నిపుణుల వైద్య సేవలు, నిర్ధారణ పరీక్షలు, తదుపరి చికిత్సకు అవసరమైన మార్గదర్శకత్వం అందించనున్నట్లు తెలిపారు. ప్రతి హస్తకళాకారుడు, ప్రతి చేనేత కార్మికుడు ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 'కళను గౌరవించడం అంటే కళాకారుడి శ్రమను గౌరవించడం. కళాకారుడి శ్రమను గౌరవించడం అంటే ఆయన ఆరోగ్యాన్ని కాపాడటం. కళాకారులు ఆరోగ్యంగా ఉంటేనే మన సంప్రదాయాలు, వారసత్వం భావితరాలకు సజీవంగా నిలుస్తాయి. కళను కాపాడాలంటే.. ముందు కళాకారుడిని కాపాడాలి' అని ఎక్స్‌లో పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.


# ధాన్యం కొరనుగోళ్లో రికార్డు

### వినూత్న సంస్కరణలతో రైతులకు మేలు

### పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

**విజయవాడ,**

గత రెండేళ్లుగా కూటమి ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో వినూత్న సంస్కరణలను అమలు చేసిందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ద్వారా రైతులు, రైస్ మిల్లర్ల మధ్య సమన్వయంతో కొనుగోలు పక్రియ నిర్వహిస్తోందని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మార్గదర్శకత్వంలో రాష్ట్ర చరిత్రలోనే అత్యుత్తమ ధాన్యం కొనుగోలు చేపట్టినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వంలో రెండేళ్ల ధాన్యం సేకరణ విజయవంతంగా పూర్తవడంపై పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో రైతులు, రైస్ మిల్లర్లతో ప్రత్యేక సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. జిల్లా స్థాయిలో అధికారులు బాగా పని చేశారని కొనియాడారు. రానున్న సీజన్‌లో ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన కల్పిస్తామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో 42 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, కూటమి ప్రభుత్వం రెండో ఏడాదిలో 74 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసిందని వివరించారు. రూ.31 వేల కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేసి, 11.53 లక్షల మంది రైతులకు 95 శాతం చెల్లింపులు 24 గంటల్లోనే చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో మధ్యాహ్న భోజన పథకానికి నాణ్యమైన బీపీటీ బియ్యం అందిస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ అమలు చేస్తున్న 10 శాతం బ్రోకెన్ రైస్ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తించి దేశవ్యాప్తంగా అమలు చేయాలని నిర్ణయించిందన్నారు. ప్రతి ధాన్యం బస్తాకు క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేసి, రైతు నుంచి ఫెయిర్ ప్రైస్ షాప్ వరకు పూర్తి వివరాలు తెలుసుకునే వ్యవస్థ ఏర్పాటు చేశామన్నారు. వాట్సాప్ ద్వారా రైతులు ధాన్యం విక్రయించుకునే సౌకర్యాన్ని కల్పించామని వెల్లడించారు. గన్నీ బ్యాగులు, గోదాములు, రవాణా, తేమ శాతం వంటి అంశాల్లో పారదర్శకత పెంచేందుకు చర్యలు తీసుకున్నామని నాదెండ్ల తెలిపారు. ఖరీఫ్ నుంచి రైతు సేవా కేంద్రాల్లోనే గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచామన్నారు. రవాణా జాప్యాన్ని నివారించేందుకు ట్రాన్స్‌పోర్ట్ ఖర్చులను కూడా 48 గంటల్లో రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలిపారు. ఆర్ఎఫ్ఐడీ స్టిక్కర్లు, స్కానర్లతో లారీల కదలికలను పర్యవేక్షించే వ్యవస్థ అమలు చేస్తున్నామని చెప్పారు. తేమ కొలిచే మాయిశ్చర్ మీటర్లు అన్ని చోట్లా ఒకే కంపెనీ, ఒకే మోడల్‌లో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుతం 90 శాతం ఏర్పాటు పూర్తవగా, ఖరీఫ్ నాటికి 100 శాతం పూర్తి చేస్తామని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో ఈ సీజన్‌లో వరి ఉత్పత్తి సుమారు 15 శాతం తగ్గే అవకాశం ఉందని ప్రాథమిక అంచనాలు ఉన్నాయన్నారు. రైతులకు ముందస్తు అవగాహన కల్పించి, అవసరమైన సూచనలు అందించి సమస్యలను అధిగమించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టనున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.



# వైసిపి పాలనతో ప్రజలకు తప్పని ఇక్కట్లు

### ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో భయాందోళనలు

### అధికారంలోకి రాగానే దాన్ని రద్దు చేశాం


### దళారులతో పనిలేకుండా పట్టాదారు పాస్ పుస్తకాలు

### కులమత విద్వేషాలు రగిలించే వారిపట్ల జాగ్రతగా ఉండాల్సిందే

### బనగానిపల్లె సభలో సిఎం చంద్రబాబు నాయుడు

**నంద్యాల,**

గత వైసిపి పాలకుల నిర్ణయాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని సీఎం చంద్రబాబు అన్నారు. వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్.. ప్రజల్లో భయాందోళనలు సృష్టించిందని విమర్శించారు. మాట వినని వారి భూములను 22ఏ జాబితాలో చేర్చారని వ్యాఖ్యానించారు. బనగానప్లలెలో రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసినట్లు తెలిపారు. ప్రజల ఆస్తిపై ప్రజలకే హక్కు ఉండాలని స్పష్టం చేసిన సీఎం.. భూమి ప్రజలదైతే పట్టా పుస్తకాలపై, భూమి సరిహద్దు రాళ్లపై గత ప్రభుత్వం తమ ఫొటోలు, పేర్లు ముద్రించడం సరైంది కాదన్నారు. ఫొటోల పిచ్చి పరాకాష్ఠకు చేరిందని విమర్శించారు. జగన్ ఫొటోలతో ఉన్న పాత పట్టాదారు పాస్‌పుస్తకాలను రద్దు చేసి, ఇప్పుడు రాజముద్రతో పాస్‌పుస్తకాలను అందిస్తున్నామని చెప్పారు. రైతులకు పారదర్శకమైన సేవలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ప్రతి సమస్యనూ పరిష్కరించే బాధ్యత తమదేనని చెప్పారు. దళారీ వ్యవస్థకు తావు లేకుండా గ్రామసభల్లోనే పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఒక్క రూపాయి కూడా అవినీతి లేకుండా పాలన అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. పట్టాదారు పాస్‌పుస్తకాలపై ఉన్న క్యూఆర్ కోడ్ ద్వారా భూమికి సంబంధించిన పూర్తి వివరాలను



సులభంగా తెలుసుకునే అవకాశం ఉంటుందని సీఎం చంద్రబాబు వెల్లడించారు. ప్రతి సమస్యకు పరిష్కారం చూపే బాధ్యత నాది. తిరుపతి జిల్లా శెట్టిపల్లిలో, గుంటూరు జిల్లా వట్టిచెరుకూరులో 70 ఏళ్ల నాటి సమస్యలు పరిష్కరించాం. భూముల వివరాలన్నీ మీ సమక్షంలోనే పొందుపరుస్తున్నాం. దళారీ వ్యవస్థకు చోటు లేకుండా గ్రామసభల్లోనే పుస్తకాలిస్తున్నాం. ఒక్క రూపాయి కూడా అవినీతి లేకుండా చేయాలన్నదే మా లక్ష్యం. 6,887 గ్రామాల్లో సర్వే చేశాం.. 29,04,000 పాస్ పుస్తకాలిచ్చాం. క్యూఆర్ కోడ్‌లో రికార్డులన్నీ స్పష్టంగా ఉంటాయి. డోన్‌లో ఎన్నో ఏళ్లుగా వక్ఫ్ భూములు సాగు చేసుకుంటున్న 784 మంది రైతుల సమస్య పరిష్కరించాం అని వివరించారు. రౌడీలు, సంఘ విద్రోహ శక్తులను ఎవరూ ప్రోత్సహించవద్దు. కుల, మతాలను విభజించడానికి వీల్లేదు. రావణ్ అనే వ్యక్తి.. పురాణాలను దూషించాడు. రాముడు, సీతపై నీచంగా మాట్లాడాడు. తీవ్రవాదాన్ని, పాకిస్థాన్‌ను సమర్థించాడు. ఇలాంటి వాళ్లకు గొడ్డలిపార్టీ ఆర్థికసాయం చేసింది. రాష్ట్రంలో వింత ప్రవర్తన కలిగిన కొందరు వ్యక్తులున్నారు. ఆస్తి కోసం తల్లిని హింసిస్తున్నారు. ఓట్ల కోసం చనిపోయిన తండ్రికి పూజలు చేస్తున్నారు. తల్లిని గౌరవించలేని వ్యక్తి మనకు అవసరమా? తల్లులంటే గౌరవం ఉండాలనే.. తల్లికి వందనం తీసుకొచ్చా. గొడ్డలి పార్టీ.. విసుగు, విరామం లేకుండా కుట్రలు, కుతంత్రాలు చేస్తోంది. కులం, మతం, ప్రాంతాల వారీగా ముక్కలు చేసే కుట్రకు పాల్పడుతోంది. రాయలసీమలో ముఠాలు లేకుండా చేసింది తెదేపానే. ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదు. ప్రజల ఆస్తులు, ప్రాణాలకు రక్షణగా ఉండాలి. ఆడబిడ్డలు స్వేచ్ఛగా తిరగాలి. మత విద్వేషాలు రెచ్చగొట్టడం, మనోభావాలు దెబ్బతీయడం మంచిదికాదు. ఆడబిడ్డల జోలికి వస్తే అదే చివరిరోజు అని మళ్లీ హెచ్చరిస్తున్నానని చంద్రబాబు అన్నారు. గ్రామసభలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ.. వైసీపీపై తీవ్ర విమర్శలు చేశారు. బనగానప్లలె.. బ్రహ్మంగారు నడయాడిన పవిత్ర ప్రాంతమని పేర్కొన్న ఆయన, గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి కంటే అరాచక పాలనే ఎక్కువగా కనిపించిందని అన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన అనేక అభివృద్ధి పనులను వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిందని మంత్రి విమర్శించారు. ఐదేళ్లలో రాయలసీమ కోసం వైసీపీ నేతలు ఏం చేశారో, తాము ఏం చేశామో ప్రజల సమక్షంలో చర్చకు రావాలని సవాల్ చేశారు. బనగానప్లలె బైపాస్ రోడ్డు నిర్మాణాన్ని టీడీపీ ప్రభుత్వం ప్రారంభిస్తే, వైసీపీ ప్రభుత్వం దానిని నిలిపివేసిందని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం మళ్లీ తమ ప్రభుత్వం ఆ పనులను వేగవంతం చేసి బైపాస్ రోడ్డు నిర్మాణంలో 70 శాతం పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. అలాగే బనగానప్లలెలో 41 కిలోమీటర్ల అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను పూర్తి చేశామని మంత్రి వెల్లడించారు. గ్రామాల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గ్రామీణ వ్యవస్థను నిర్వీర్యం చేశారని బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు.

# మరోమారు కలవర పెడుతున్న కోవిడ్

### రాజంపేటకు చెందిన వ్యక్తి కోవిడ్‌తో మృతి

### అప్రమత్తం అయిన వైద్యారోగ్య శాఖ

**తిరుపతి,**

కోవిడ్ మరోమారు కలవర పెడుతోంది. కడప జిల్లా రాజంపేటకు చెందిన ఒక వ్యక్తి(52) కొవిడ్ కారణంగా చనిపోవడంతో వైద్యశాఖ అప్రమత్తమైంది. అన్ని జిల్లాల్లో ఆరా తీయగా కడప, తిరుపతి జిల్లాల్లో 5 కొవిడ్ పాజిటివ్ కేసులు నమోదైనట్టు గుర్తించింది. దీంతో మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ (డీఎంఈ) రాష్ట్రంలోని ప్రధాన ప్రభుత్వ ఆస్పత్రుల సూపరింటెండెంట్లకు లేఖలు రాశారు. కొవిడ్ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని, ఆస్పత్రుల్లో అందుబాటులో ఉన్న ఐసోలేషన్ బెడ్లు, ఐసీయూ పడకలు, ఆక్సిజన్ సౌకర్యం, వెంటిలేటర్లు, మందులు, ర్యాపిడ్ కిట్లు, అంబులెన్స్ వంటి వైద్య సిబ్బంది వివరాలతో నివేదిక పంపాలని ఆదేశించారు. ఇటీవల నమోదైన కేసుల నేపథ్యంలో అవసరమైతే వెంటనే చికిత్స అందించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని వైద్యాధికారులకు సూచించినట్టు సమాచారం.కడప జిల్లా రాజంపేటకు చెందిన ఒక వ్యక్తి (52) తీవ్రమైన ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతూ గత నెల 24న వేలూరు సీఎంసీలో చికిత్స నిమిత్తం చేరారు. నిమోనియా వ్యాధిని గుర్తించారు. అనుమానంతో కొవిడ్ పరీక్ష చేయగా 26వ తేది పాజిటివ్ వచ్చింది. చికిత్స పొందుతూ 28న మృతిచెందడంతో వైద్యశాఖ అప్రమత్త మైంది. కొవిడ్ పాజిటివ్ కేసులు నమోదైన నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని డీఎంఈ ఆదేశిచ్చారు. రుయాలో కొవిడ్ ఐసోలేషన్ వార్డు ఏర్పాటుచేశాం. కొవిడ్ టెస్ట్ కిట్లు, సిబ్బంది, అవసరమైన మందులతో సిద్ధంగా ఉన్నాం. రుయాలో ఇప్పటివరకు ఎలాంటి కేసులు నమోదుకాలేదు. ప్రస్తుతం నమోదైన కేసుల్లో తీవ్రమైన లక్షణాలు లేవని, అయినప్పటికీ అప్రమత్తంగా ఉండాలని భావిస్తున్నాం. కరోనాతో గతంలో లాగా భయపడాల్సిన పనిలేదు. వాతావరణంలో మార్పుల కారణంగా రోగనిరోధక శక్తి తగ్గినవారు అశ్రద్ధ చేయకూడదు. జ్వరం, దగ్గు, గొంతునొప్పి వంటి లక్షణాలుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. వృద్ధులు, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

# ఇప్పుడు అయోధ్య..గతంలో వారణాసి

### దేవుళ్లకే పంగనామాలు పెట్టిన దగుల్బాజీలు

### హిందువుల విశ్వాసాలను దెబ్బతీసిన దౌర్భాగ్యులు

**వారణాసి,**

ఆలయంలో దోపిడీ అంటే భక్తుల నమ్మకాన్ని, విశ్వాసాన్ని దోచుకోవడమే. ఇటీవల అయోధ్య రామమందిర విరాళాల చోరీ ఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. అయోధ్య రామాలయంలో విరాళాల దుర్వినియోగం కేసు నేపథ్యంలో, గతంలో జరిగిన కాశీ విశ్వనాథుడి ఆలయ దోపిడీ ఘటన మళ్లీ చర్చనీయాంశమైంది. నాలుగు దశాబ్దాల క్రితం, కాశీ విశ్వనాథ ఆలయంలో జరిగిన ఒక దొంగతనం కారణంగా దాని నిర్వహణను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవలసి వచ్చింది. 1983 జనవరిలో, కాశీ విశ్వనాథ ఆలయ గర్భగుడిలో శివలింగం చుట్టూ ఉన్న 2.6 కిలోల బంగారు ఆభరణాలు, దాదాపు 9 కిలోల వెండి చోరీకి గురయ్యాయి. ఈ చోరీకి పాల్పడిన 11 మందిని అరెస్ట్ చేశారు. అప్పుడు కూడా ఆలయంలో పని చేసే వారి సహాయంతోనే దోపిడీ జరిగినట్టు పోలీసులు వెల్లడించారు. ఘటన అనంతరం కాశీ విశ్వనాథ ఆలయ భద్రత, ఆర్థిక నిర్వహణలో లోపాలపై తీవ్ర విమర్శలు వచ్చాయి. దీంతో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకొచ్చింది. ఆలయ నిర్వహణను ప్రభుత్వం ఏర్పాటు చేసిన ట్రస్ట్ బోర్డు ఆధీనంలోకి తీసుకువచ్చింది. అప్పటి నుంచి భద్రతా వ్యవస్థలు, విరాళాల లెక్కింపు, పరిపాలనలో పలు సంస్కరణలు అమల్లోకి వచ్చాయి. అయోధ్య రామమందిర విషయంలో కూడా ప్రభుత్వం నూతన సంస్కరణలు చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. కాగా, రామ మందిర ఆలయ ట్రస్టుకు జవాబుదారీగా ఉండే సీఈవో నియామకానికి తాము అంగీకరిస్తామని, అయితే ప్రభుత్వ స్వాధీనాన్ని మాత్రం అనుమతించబోమని వీహెచ్‌పీ తెలిపింది. శ్రీ రామ్ జన్మభూమి ఆలయాన్ని ప్రభుత్వ నియంత్రణలోకి తీసుకువచ్చే ఏ ప్రయత్నాన్నైనా తాము వ్యతిరేకిస్తామని వీహెచ్‌పీ పేర్కొంది.

# కివీస్ లో మోడీకి ఘన స్వాగతం




**న్యూఢిల్లీ జూలై 10 ( అర్జున్ సమాచారం ప్రతినిధి )**

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మూడు దేశాల పర్యటనలో భాగంగా శుక్రవారం న్యూజిలాండ్‌లో అడుగుపెట్టారు. ఇండోనేషియా, ఆస్ట్రేలియా పర్యటనలను ముగించుకుని ఆయన శుక్రవారం ఆక్లాండ్‌కు చేరుకున్నారు. సుమారు నాలుగు దశాబ్దాల విరామం తర్వాత న్యూజిలాండ్‌లో పర్యటిస్తున్న తొలి భారత ప్రధానిగా మోదీ నిలిచారు. ఆక్లాండ్ విమానాశ్రయంలో న్యూజిలాండ్ ప్రధానమంత్రి క్రిస్టఫర్ లక్సన్ స్వయంగా మోదీకి సాదర స్వాగతం పలికారు.రెండు రోజుల పాటు సాగే ఈ పర్యటనలో ప్రధాని మోదీ, లక్సన్‌తో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. ఇరు దేశాల మధ్య ఆర్థిక, వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడంపై ఈ భేటీలో ప్రధానంగా దృష్టి సారించనున్నారు. ఇటీవలే పురోగతి సాధించిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం చర్చల నేపథ్యంలో ఈ పర్యటనకు అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది. ఈ పర్యటనలో భాగంగా మోదీ ప్రవాస భారతీయులను ఉద్దేశించి కూడా ప్రసంగించనున్నారు.భారత్ 'యాక్ట్ ఈస్ట్ పాలసీ', 'మహాసాగర్' విజన్‌ను బలోపేతం చేయడంతో పాటు, స్వేచ్ఛాయుత ఇండో–పసిఫిక్ ప్రాంతం పట్ల తమ నిబద్ధతను ఈ పర్యటన పునరుద్ఘాటిస్తుందని మోదీ తన పర్యటనకు ముందు ఒక ప్రకటనలో తెలిపారు. 2025 మార్చిలో లక్సన్ జరిపిన భారత పర్యటనతో వచ్చిన సానుకూలతను ఈ పర్యటన మరింత ముందుకు తీసుకెళుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.ఆస్ట్రేలియా పర్యటనలో ప్రధాని మోదీ రక్షణ, సముద్ర సహకారాన్ని పెంపొందించుకోవడంతో పాటు, భారత్‌కు యురేనియం సరఫరాకు వీలు కల్పించే కీలకమైన పౌర అణు ఇంధన ఒప్పందం కుదుర్చుకున్నారు. అంతకుముందు ఇండోనేషియా పర్యటనలో కీలక ఖనిజాలు, సముద్ర భద్రత వంటి అంశాలపై పలు కీలక ఒప్పందాలు

## మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు బర్త్‌డే వేడుకలు.. అనాథాశ్రమంలో నిర్వహించిన డా. కొమ్ము అశోక్ యాదవ్

**హైదరాబాద్ ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూలై 10:**

ఈరోజు హైదరాబాద్ లో ఉన్న మదర్ తెరిసా అనాథాశ్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, చెన్నూరు నియోజక వర్గ మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు జన్మదిన వేడుకలు తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్ ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదన్న బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి నిరుపేదల పాలిట పెన్నిధి అని , అన్న అంటే నేనున్నా అంటూ ఆపదలో ఆదుకునే ఆపద్బాంధవుడు అని చెన్నూరు నియోజకవర్గం లో అనేక సేవా కార్యక్రమాలు చేసి ఎంతోమందిని ఆపదలో ఆదుకున్న గొప్ప మహనీయుడు అని ఆయన జన్మదిన వేడుకలను ఈరోజు అనాథ పిల్లల మధ్య కేక్ కట్ చేసి ఫ్రూట్స్ బిస్కెట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకుంటూ మా ప్రియతమ నాయకుడు నల్లాల ఓదెన్న నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉంటూ ఉన్నత పదవులు స్వీకరించాలని కోరుకుంటూ హృదయపూర్వకంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎంకే రాజేష్ పాల్గొన్నారు.



PRGI NO: TGTEL/25/A5314

అర్జున్ సమాచారం

www.arjunsamaachaaram.in

తెలుగు దినపత్రిక

ఎడిటర్ : లింగం రాజయ్య

బ్యూరో చీఫ్ : గిరవెన రాకేష్

# అమ్ములపొదిలో పాశుపతాస్త్రం

**న్యూఢిల్లీ, జూలై 10, (అర్జున్ సమాచారం ప్రతినిధి)**

భారత రక్షణ రంగం పాశుపతాస్త్రంను సిద్ధం చేసింది. ఇప్పటికే ప్రపంచంలో అత్యంత శక్తి వంతంగా గుర్తింపు పొందిన ఇడియన్ ఆర్మీ చేతిలోకి ఇది రావడంతో మరింత బలం చేకూరినట్లయింది. పూర్తిగా స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేసిన 'పినాకా లాంగ్ రేంజ్ గైడెడ్ రాకెట్ ను విజయవంతంగా పరీక్షించారు. దీంతో భారత సైన్యం దీర్ఘదూర దాడి సామర్థ్యం మరింత బలోపేతమైంది. అయితే ఇది ఎలా తయారైంది? దీని వల్ల సైన్యానికి ఎటువంటి ఉపయోగం?ఒడిశాలోని చాందీపూర్ ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ లో 8, జూలై 2026న నిర్వహించిన ఈ పరీక్షలో రాకెట్ నిర్దేశించిన 60 కిలోమీటర్ల కనిష్ఠ దూరాన్ని అత్యంత కచ్చితత్వంతో చేరుకుని లక్ష్యాన్ని ఛేదించింది. పరీక్ష సందర్భంగా ప్రయోగించిన పినాకా ఎల్ఆర్‌జీఆర్ ముందుగా నిర్దేశించిన మార్గాన్నే అనుసరిస్తూ ఎలాంటి వ్యత్యాసం లేకుండా ప్రయాణించింది. చివరికి లక్ష్యాన్ని అత్యంత ఖచ్చితత్వంతో తాకింది. రాకెట్ గైడెన్స్, నావిగేషన్, కంట్రోల్ వ్యవస్థలు అద్భుతంగా పనిచేశాయని ఈ పరీక్ష మరోసారి నిరూపించింది.పినాకా ఎల్ఆర్‌జీఆర్‌ను డీఆర్‌డీవో ఆధ్వర్యంలో అభివృద్ధి చేశారు. పూణెలోని ఆర్మమెంట్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ , హై ఎనర్జీ మెటీరియల్స్ రీసెర్చ్ లాబొరేటరీ (లు ఈ రాకెట్ రూపకల్పనలో కీలక పాత్ర పోషించాయి. అలాగే హైదరాబాద్‌లోని డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ లాబొరేటరీ , రీసెర్చ్ సెంటర్ ఇమారత్ గైడెన్స్, నావిగేషన్, నియంత్రణ



వ్యవస్థలకు అత్యాధునిక సాంకేతిక సహకారం అందించాయి.పినాకా ఎల్ఆర్‌జీఆర్ సాధారణ రాకెట్ కాదు. ఇది లక్ష్యానికి చేరుకునేంతవరకు తన దిశను సరిచేసుకుంటూ ప్రయాణించే గైడెడ్ రాకెట్. అందువల్ల శత్రు కమాండ్ సెంటర్లు, బంకర్లు, వ్యూహాత్మక స్థావరాలు వంటి కీలక లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో ధ్వంసం చేయగలదు. తక్కువ సమయంలో భారీ అగ్నిశక్తిని ప్రదర్శించగల సామర్థ్యం దీనికి ప్రత్యేకత.ఈ విజయవంతమైన పరీక్షతో భారత సైన్యానికి అత్యాధునిక ఆయుధ వ్యవస్థ మరోటి అందుబాటులోకి రానుంది. సరిహద్దు భద్రత, ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్లు, యుద్ధ పరిస్థితుల్లో వేగవంతమైన ప్రతిస్పందనకు ఈ రాకెట్ కీలకంగా ఉపయోగపడుతుందని రక్షణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. భారత భూసేన అగ్నిశక్తిని మరింత పెంచడంలో పినాకా కీలక పాత్ర పోషించనుంది. ఈ పరీక్ష స్వదేశీ రక్షణ తయారీ సామర్థ్యానికి మరో నిదర్శనంగా నిలిచింది. విదేశీ ఆయుధాలపై ఆధారపడకుండా అత్యాధునిక రాకెట్ వ్యవస్థలను దేశీయంగానే అభివృద్ధి చేయగల సామర్థ్యం భారత్‌కు ఉందని ఈ పరీక్ష మరోసారి ప్రపంచానికి చాటిచెప్పింది. రక్షణ రంగంలో స్వావలంబన లక్ష్యానికి ఇది మరింత బలాన్ని చేకూర్చనుంది.పినాకా లాంగ్ రేంజ్ గైడెడ్ రాకెట్ విజయవంతమైన పరీక్షతో భారత్ ఆధునిక రాకెట్ సాంకేతికతలో మరో కీలక అడుగు వేసింది. ఖచ్చితత్వం, దీర్ఘదూర దాడి సామర్థ్యం, స్వదేశీ అభివృద్ధి వంటి అంశాల్లో ఈ వ్యవస్థ భారత రక్షణ రంగానికి కొత్త బలాన్ని అందించనుంది. భవిష్యత్తులో మరిన్ని అత్యాధునిక ఆయుధ వ్యవస్థల అభివృద్ధికి ఇది మార్గదర్శకంగా నిలుస్తుందని రక్షణ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## సంపాదకీయం...

# పేదల ఉపాధికి పెద్దల ఎసరు

మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి పథకం స్థానంలో, వికసిత్ భారత్ –జి– రామ్ జి పథకాన్ని తీవ్ర వ్యతిరేకత మధ్య జులై 1 నుండి మోడీ ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. ఈ పథకం ద్వారా పేదలను క్రమంగా ఉపాధికి దూరం చేయడం మోడీ ప్రభుత్వ విధానంగా ఉంది. ఈ పథకాన్ని రద్దు చేయాలని రైతు, రైతు కూలీ సంఘాలు దేశవ్యాప్తంగా ఉద్యమ బాట పట్టాయి. ఒక మేరకు ఉపాధి కల్పిస్తున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని క్రమంగా నిర్వీర్యం చేసి చివరికి రద్దు చేసేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించింది. నిధులు పెంచకుండా చేసి ఇప్పుడు ఆ పథకాన్నే రద్దు చేసే విధానాలు అమలు చేస్తున్నది. అందులో భాగమే మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి 'వికసిత్ భారత్– జిరామ్ జి (గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అండ్ ఆ జీవక్ మిషన్ (గ్రామన్)గా పేరు పెట్టింది. దీనికి సంబంధించిన బిల్లును 16 –డిసెంబర్, –25 పార్లమెంట్ లో ప్రవేశపెట్టి ఎటువంటి చర్చ లేకుండానే నిరసనల మధ్య 18–డిసెంబర్, 25న బిల్లును మోడీ ప్రభుత్వం చట్టంగా ఆమోదం పొందింది.˹ ఈ బిల్లులో పంచాయతీల ద్వారా పనులు అమలు, పని దినాలను 100 నుంచి 125 రోజులకు పెంపు, వ్యవసాయ సీజన్‌లో కూలీల కొరత లేకుండా ఉపాధి పనులను 60 రోజుల వరకు తాత్కాలిక నిలిపివేత, వికసిత భారత్ లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్ర, జిల్లా, బ్లాక్ స్థాయిలో పనులు, ప్రణాళికలు, వారానికి ఒకసారి కూలి చెల్లింపు, ఎ, బి, సి లు గ్రామపంచాయతీల విభజన, కేంద్రం నిర్ధారించిన పారా మీటర్స్ ఆధారంగా రాష్ట్రాల వారీగా ఉపాధి పనుల కేటాయింపు, కేటాయింపులకు అదనంగా నిధులు ఖర్చు చేస్తే దాన్ని రాష్ట్రాలే భరించడం, ఉపాధి పనుల కేంద్రం 60%, రాష్ట్రం 40% నిధుల కేటాయింపు ఈ బిల్లులో ప్రధాన అంశాలుగా ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి తగ్గి, నిరుద్యోగం పెరగడం, ఉపాధి కోసం గ్రామీణ పేదలు పట్టణాలకు వలస బాట పట్టటం, ప్రభుత్వం వెడల గ్రామీణ పేదల్లో వ్యతిరేక వ్యక్తం కావడం దృష్టిలో పెట్టుకుని, ఆ వ్యతిరేకతను చల్లార్చేందుకు యుపిఎ ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పథకం తేవడం జరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో నికరమైన ఆదాయ కల్పన, వనరుల ఉత్పాదక, అభివృద్ధి లక్ష్యాలుగా 2005 లో అప్పటి యుపిఎ ప్రభుత్వం గ్రామీణ ఉపాధి పథకం లక్ష్యంగా ప్రకటించింది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకంగా యుపిఎ ప్రభుత్వం పథకం పేరు మార్చింది. ఈ పథకం కింద జాబ్ కార్డు పొందిన ప్రతి కుటుంబానికి 100 రోజుల పని కల్పిస్తామని చెప్పింది. మోడీ పాలనలో 2024 నాటికి దేశంలో జాబ్ కార్డులు పొందిన కుటుంబాలు 9 కోట్ల, 2 లక్షలుగా ఉన్నాయి. ఉపాధి పథకం ప్రారంభమైన దగ్గర నుంచి ఇప్పటి వరకు కుటుంబాలకు వంద రోజుల పని కల్పించడంలో పాలక ప్రభుత్వాలన్నీ విఫలం అయ్యాయి. ఎన్‌డిఎ ప్రభుత్వం 2024–25 ఆర్థిక సంవత్సరంలో 40.70 లక్షల కుటుంబాలకు వంద రోజుల పని లభిస్తే, 2025– 26 ఆర్థిక సంవత్సరంలో 6.74 లక్షల కుటుంబాలకు మాత్రమే 100 రోజుల పని లభించింది. యుపిఎ ప్రభుత్వ పాలనలోనే పథకాన్ని నీరుగార్చే విధానాలు ప్రారంభమై నేడు మోడీ ప్రభుత్వ పాలనలో అది తీవ్రమైంది. అందుకు అనుగుణంగానే పథకానికి నిధుల కేటాయింపులు తగ్గించడం లేదా పెంచకపోవడం జరిగింది. 4 కోట్ల, 57 లక్షల జాబ్‌కార్డులు తొలగించడం చేసింది. 2025 –26 ఆర్థిక సంవత్సరంలోనే 18.34 జాబ్ కార్డులు తొలగించి, 100 రోజులు పని కల్పించడంలో విఫలమైంది. ఈ విషయాన్ని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌవాన్ 9– డిసెంబర్ –2025న పార్లమెంట్ కి తెలిపారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలోనే 18.34 లక్షల జాబ్ కార్డులు తొలగించింది. 2019–20, –2024–25 మధ్య అత్యధికంగా తొలగించబడిన జాబ్ కార్డుల సంఖ్య కోటి, 4 వేల మంది. రాష్ట్రాల వారీగా చూస్తే ఆంధ్రప్రదేశ్ అత్యధికంగా 11 లక్షల జాబ్ కార్డులు తొలగించబడ్డాయి.

# రాజాపూర్‌లో ఘనంగా శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ 22వ వార్షికోత్సవం

పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూలై 10: రామగిరి మండలం రాజాపూర్ గ్రామంలోని శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయ 22వ వార్షికోత్సవాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పుల్లెల భాగ్యలక్ష్మి కొమురయ్య, ఆలయ కమిటీ చైర్మన్ నరహరి సంతోష్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఉదయం వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, అర్చనలు, హోమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ పుల్లెల భాగ్యలక్ష్మి కొమురయ్య ప్రత్యేక పూజలు నిర్వహించగా, మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్ ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.అనంతరం స్వామివారికి మహానైవేద్యం సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన ఉగ్గె లక్ష్మి––శంకరయ్య, కాసేటి నగేష్ దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఉత్సవాలకు హాజరై స్వామివారి దర్శనం చేసుకుని ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది.ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ పుల్లెల సతీష్, మాజీ ఎంపీపీ అరెల్లి దేవక్క కొమురయ్య, సర్పంచులు కొండవేన దివ్య సుధాకర్, ఇల్లందుల సంజీవ్, వీరగొని రమాదేవి శ్రీనివాస్, వార్డు సభ్యులు శేషికుమార్, పుల్లెల సుజాత, పుట్ట లక్ష్మి, ఎండీ హ్యాపీజ్, మాజీ ఉపసర్పంచులు ఉగ్గె కుమార్, నూనేటి లింగయ్య, గ్రామ నాయకులు పుల్లెల సురేష్, కలవేన అభిలాష్, గరిగంటి సంపత్, నూనేటి అంజి, ఉగ్గె ప్రశాంత్, పాశం కొమురయ్య, కన్నూరి కిరణ్, మంథని కుమార్, సంఖ్యలో పాల్గొన్నారు.



అర్జున్ సమాచారం

www.arjunsamaachaaram.in

తెలుగు దినపత్రిక

## ఆట



# రజత్ పాటిదార్‌ను జట్టులోకి తీసుకోవాలి


అంతర్జాతీయ టీ20ల్లో వరల్డ్ ఛాంపియన్ టీమిండియా వరుస పరాజయాలను ఎదుర్కొంటుంది. పసికూన ఐర్లాండ్ చేతిలో రెండు టీ20ల సిరీస్‌ను కోల్పోయిన భారత్.. ఇంగ్లండ్ గడ్డపై అదే పేలవ ప్రదర్శనను కొనసాగించింది. నయా టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో టీమిండియా నాలుగు మ్యాచ్‌లు ఆడి ఒక్క విజయం సాధించలేకపోయింది.ఈ నేపథ్యంలోనే టీమ్ కాంబినేషన్‌పై టీమిండియా మేనేజ్‌మెంట్ ప్రత్యేక దృష్టి సారించాలని మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ అభిప్రాయపడ్డాడు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) కెప్టెన్ రజత్ పాటిదార్‌ను భారత టీ20 జట్టులోకి తీసుకోవాలని సూచించాడు. ప్రస్తుత భారత టీ20 జట్టులో సమతుల్యత లోపించిందని, ఆ లోపాన్ని సరిదిద్దేందుకు పటీదార్ సరైన ఎంపికని పఠాన్ పేర్కొన్నాడు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఓ పోస్ట్‌ను షేర్ చేశాడు.'ప్రస్తుత భారత టీ20 జట్టులో ఎడమచేతి వాటం బ్యాటర్లు ఎక్కువగా ఉన్నారు. బ్యాటింగ్ ఆర్డర్‌లో సమతుల్యం రావాలంటే కుడిచేతి వాటం కలిగిన రజత్ పాటిదార్‌ను జట్టులోకి తీసుకు రావాల్సిన అవసరం ఉంది. తదుపరి టీ20 ప్రపంచకప్‌నకు ఇంకా చాలా సమయం అందుబాటులో ఉన్నందున, పటీదార్ లాంటి ప్రతిభావంతుడికి తగిన అవకాశాలు ఇచ్చి పరీక్షించాలి.'అని పఠాన్ సూచించాడు.32 ఏళ్ల రజత్ పాటిదార్ ఇప్పటివరకు అంతర్జాతీయ టీ20ల్లో అరంగేట్రం చేయకపోయినప్పటికీ.. దేశవాళీ క్రికెట్‌లో మెరుగైన ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. అతను 106 ఇన్నింగ్స్‌ల్లో 160.08 స్ట్రైక్ రేట్‌తో 3,389 పరుగులు చేశాడు. అంతేకాకుండా.. తన సారథ్యంలో ఆర్‌సీబీకి వరుసగా రెండు టైటిళ్లు అందించాడు. కానీ అతని వయసు ఎక్కువగా ఉందనే కారణంతో సెలెక్టర్లు పట్టించుకోవడం లేదు. కనీసం ఇర్ఫాన్ పఠాన్ సూచనలతోనైనా మేనేజ్‌మెంట్ రజత్ పాటిదార్‌కు అవకాశం ఇస్తుందో లేదో చూడాలి.ఇంగ్లండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌లో భారత్ 0 1తో వెనుకంజలో ఉంది. తొలి టీ20 వర్షార్పణం కాగా రెండో టీ20లో రవి బిష్ణోయ్ చెత్త బౌలింగ్‌తో ఓటమిపాలైంది. మాంచెస్టర్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ 4 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఇరు జట్ల మధ్య మూడో టీ20 మంగళవారం రాత్రి 10 గంటలకు జరగనుంది. వరుస పరాజయాలతో నయా కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌పై ఒత్తిడి పెరుగుతోంది.

# వన్డేల నిడివి తగ్గింపు ప్రతిపాదన

## క్రికెట్ క్యాలెండర్‌లో సంచలన మార్పులు

అంతర్జాతీయ క్రికెట్ భవిష్యత్తును కాపాడేందుకు, మూడు ఫార్మాట్లను గాడిలో పెట్టేందుకు ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) కొన్ని విప్లవాత్మక మార్పులపై కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా వన్డేల నిడివిని తగ్గించడం, సరికొత్త గ్లోబల్ టీ20 ఫ్రాంచైజీ పోటీలను ప్రవేశపెట్టడం, ఆసియా కప్ వంటి ఖండాల వారీ టోర్నమెంట్‌లను పెంచడం, మూడు ఫార్మాట్‌లకు ప్రత్యేక విండోలను కేటాయించడం వంటి కీలక ప్రతిపాదనలు తెరపైకి వచ్చాయి. ఐసీసీ నియమించిన అమెరికన్ కన్సల్టింగ్ సంస్థ 'మెకిన్సే' చేపట్టిన వ్యూహాత్మక సమీక్షలో భాగంగా ఈ వినూత్న ఆలోచనలు బయటకు వచ్చాయి. బుధవారం ఎడిన్‌బరోలో జరగనున్న ఐసీసీ వార్షిక సాధారణ సమావేశంలో 12 మంది పూర్తిస్థాయి సభ్యులు ఈ అంశాలపై సుదీర్ఘంగా చర్చించనున్నారు. ప్రస్తుతం క్రికెట్ ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందుతున్నప్పటికీ, నిజమైన గ్లోబల్ క్రీడగా మారడంలో సవాళ్లను ఎదుర్కొంటోంది. చిన్న దేశాల్లో క్రీడ విస్తరిస్తున్నా, వారి ఆర్థిక స్థిరత్వంపై నీలినీడలు ముసురుకున్నాయి. మరోవైపు, టీ20ల ధాటికి సంప్రదాయ టెస్టులు, వన్డే ఫార్మాట్లు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ముఖ్యంగా ద్వైపాక్షిక వన్డే సిరీస్‌లపై ప్రేక్షకులు ఆసక్తి చూపకపోవడంతో, టీ20ల వృద్ధి వల్ల మొదటగా దెబ్బతినేది వన్డే ఫార్మాటేనని మెజారిటీ వాటాదారులు నమ్ముతున్నారు. ఇదే విషయమై భారత స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఇటీవల మాట్లాడుతూ.. "క్రికెట్ గ్లోబల్ క్రీడగా మారాలన్నా, ఒలింపిక్స్‌లో చేరాలన్నా ఆట నిడివి ఎంత తక్కువగా ఉంటే అంత మేలు. టీ20 క్రికెట్ స్థిరంగా కొనసాగుతుంది కానీ, వన్డేల భవిష్యత్తుపై నాకు నమ్మకం లేదు" అని వ్యాఖ్యానించాడు. ఈ నేపథ్యంలో 50 ఓవర్ల ప్రపంచకప్‌నకు కేవలం 18 నెలల ముందు మాత్రమే వన్డేలు ఆడేలా ఐసీసీ పరిమితులు విధించే అవకాశం ఉందని నివేదికలు చెబుతున్నాయి. దీంతో పాటు, ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ)ను 2027–2029 ఎడిషన్ నాటికి 12 జట్లకు విస్తరించాలని భావిస్తోంది. ఈ రేసులో ఐర్లాండ్, జింబాబ్వే, ఆఫ్ఘనిస్థాన్ జట్లు నిలిచాయి. అయితే, ప్రస్తుత ఐసీసీ సైకిల్ ముగిసే 2031 వరకు అమల్లో ఉన్న షెడ్యూల్స్ కారణంగా.. ఈ కొత్త మార్పులన్నీ ఆ తర్వాతే పూర్తిస్థాయిలో అమలులోకి వచ్చే అవకాశం ఉంది.





# మత్తు రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం -- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్....

**అర్జున్ సమాచారం జులై 10జగిత్యాల ప్రతినిధి ::**

ధర్మపురి లో నషా ముక్త్ భారత్ కార్యక్రమశీ లో పాల్గొన్న సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ...యువత చదువుకునే సమయంలో డ్రగ్స్ జోలికి పోవద్దని, విద్యార్థులు మంచి మార్గంలో నడవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. నషా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా ధర్మపురి పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం డ్రగ్స్ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మిషన్ పరివర్తన్ కార్యక్రమంలో సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. యువత దేశ భవిష్యత్తు అని, వారు మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ తమ జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై పెట్టుకున్న ఆశలు, నమ్మకాలను నిలబెట్టేలా ప్రతి విద్యార్థి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీరేవంత్ రెడ్డి గారు తెలంగాణను డ్రగ్స్ రహిత తెలంగాణగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారని అన్నారు. రాష్ట్రంలో డ్రగ్స్ దందాపై ఉక్కు పాదం మోపడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఈగల్ టీంలను ఏర్పాటు చేసిందని అన్నారు. యువతే దేశ భవిష్యత్తు అని, వారు మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉంటూ తమ లక్ష్యాలను సాధించాలని సూచించారు. "ఒక్కసారి మాత్రమే తీసుకుంటే ఏమవుతుంది" అనే నిర్లక్ష్య ధోరణే జీవితాన్ని నాశనం చేసే స్థాయికి తీసుకెళ్తుందని, డ్రగ్స్‌కు బానిసైన తర్వాత దాని నుంచి బయటపడటం ఎంతో కష్టమని మంత్రి హెచ్చరించారు. కళాశాలలు, విద్యాసంస్థలు లేదా పరిసర ప్రాంతాల్లో డ్రగ్స్ విక్రయం లేదా వినియోగం జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరిస్తేనే మత్తు రహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అనుకోకుండా మత్తు పదార్థాలకు బానిసైన వారికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన డీ-అడిక్షన్ సెంటర్ల ద్వారా వైద్య చికిత్సతో పాటు కౌన్సెలింగ్ సేవలు అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. అలాంటి వారు ఎలాంటి సంకోచం లేకుండా ప్రభుత్వ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రభుత్వం అనేక అవగాహన కార్యక్రమాలు చేపడుతోందన్నారు. యువతలో చైతన్యం



పెంపొందించడం ద్వారా డ్రగ్స్ వినియోగాన్ని గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు కలిసి యువతను సరైన దారిలో నడిపించాలని సూచించారు. విద్యార్థులు తమ లక్ష్యాలపై దృష్టి సారించి మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని అన్నారు. ప్రతి విద్యాసంస్థలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తామని చెప్పారు. స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో ప్రతి పౌరుడి బాధ్యత ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ.. డ్రగ్స్ వల్ల వ్యక్తి మాత్రమే కాదు కుటుంబం, సమాజం కూడా తీవ్రంగా నష్టపోతుందని అన్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగాన్ని అరికట్టేందుకు పోలీసు శాఖ కఠిన చర్యలు తీసుకుంటోందని తెలిపారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండేందుకు పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చట్టవ్యతిరేకంగా డ్రగ్స్ విక్రయించే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. డ్రగ్స్ వినియోగం వల్ల ఆరోగ్యం, విద్య, ఉపాధి, కుటుంబ జీవితం తీవ్రంగా దెబ్బతింటుందని వివరించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ డ్రగ్స్ వ్యతిరేక ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. డ్రగ్స్ రహిత జిల్లా నిర్మాణానికి అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. అనంతరం మాదకద్రవ్యాల నిర్మూలనకు సంబంధించిన పోస్టర్లు, సందేశాలు ప్రదర్శించారు. విద్యార్థులు,యువత ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొని డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు.

## విద్యారంగ సమస్యలు వెంటనే పరిష్కరించాలి: ఎస్ఎఫ్ఐ



పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూలై 10: రాష్ట్రవ్యాప్తంగా వామపక్ష విద్యార్థి సంఘాలు ఇచ్చిన విద్యాసంస్థల బంద్ పిలుపులో భాగంగా శుక్రవారం మంథని కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆర్ల సందీప్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్నా విద్యారంగ సమస్యలు పరిష్కారం కాలేదని విమర్శించారు. రాష్ట్రానికి ఇప్పటికీ విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం దురదృష్టకరమని, ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాల కొరతతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల విలీన ప్రతిపాదనను విరమించుకోవాలని, విద్యార్థులకు రెండు జతల యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు సకాలంలో అందించాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకానికి నిధులు పెంచి మహిళా సంఘాల ద్వారా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు, ఎంఈఓలు, డీఈఓలు, అధ్యాపకుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణకు చట్టం తీసుకురావాలని, విద్యా హక్కు చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసి 25 శాతం ఉచిత ప్రవేశాలు కల్పించాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని, జీవో నంబర్లు 7, 8, 9లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో పుస్తకాలు, యూనిఫాంల విక్రయాలను నియంత్రించాలని, ఇంటర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని, అద్దె భవనాల్లో కొనసాగుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, గురుకుల విద్యాసంస్థలకు శాశ్వత భవనాలు నిర్మించాలని కోరారు. విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బందెల రాజ్‌కుమార్, నాయకులు తిరుపతి, రాకేష్, అవినాష్, సాయి, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# సుప్రీంకోర్టులో కలకలం!

### జడ్జీలపైకి ఫైళ్లు విసిరి, బూతులు తిట్టిన పిటిషనర్.. బయటకు గెంటేసిన సెక్యూరిటీ!

**న్యూఢిల్లీ జూలై 10**

దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో ఊహించని విధంగా తీవ్ర గందరగోళం, డ్రామా చోటుచేసుకుంది. అలహాబాద్ హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ దాఖలైన ఒక పిటిషన్ విచారణ సందర్భంగా.. స్వయంగా వాదనలు వినిపించడానికి లిటిగెంట్-ఇన్-పర్సన్ గావచ్చిన ఒక వ్యక్తి కోర్టు హాల్లో వీరంగం సృష్టించాడు. న్యాయమూర్తులపైకి కేసు ఫైళ్లను విసిరేయడమే కాకుండా, బహిరంగ కోర్టులోనే జడ్జీలను ఉద్దేశించి తీవ్రమైన బూతులు తిడుతూ రెచ్చిపోయాడు. దీంతో సెక్యూరిటీ సిబ్బంది వెంటనే రంగంలోకి దిగి అతడిని కోర్టు హాలు నుంచి బలవంతంగా బయటకు లాగేశారు. జస్టిస్ కేవీ విశ్వనాథన్, జస్టిస్ అలోక్ అరాధేలతో కూడిన ధర్మాసనం ఎదుట ఈ వింత పరిణామం వెలుగుచూసింది. కోర్టు విచారణ ప్రారంభం కాగానే, ప్రబల్ ప్రతాప్ అనే సదరు పిటిషనర్ కనీస చట్టపరమైన వాదనలు వినిపించకుండా అత్యంత దూకుడుగా మాట్లాడటం ప్రారంభించాడు. మిస్టర్ జ్యుడీషియల్ సర్వెంట్ .. ఉత్తరప్రదేశ్ లక్నో ఏసీపీపై, డూప్లెక్స్ టెక్నాలజీస్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని నేను మిమ్మల్ని ఆదేశిస్తున్నాను. ఎందుకంటే నేను సార్వభౌముడిని " అంటూ జడ్జీలకే హుకుం జారీ చేశాడు. పిటిషనర్ ప్రవర్తనకు ధర్మాసనం ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురైంది. నువ్వు మమ్మల్ని ఆదేశిస్తున్నావా? అని జస్టిస్ విశ్వనాథన్ ప్రశ్నించారు. దానికి సదరు వ్యక్తి.. నా వైపు నుంచి చెప్పాల్సింది అంతే, అంతా రికార్డుల్లో ఉంది అంటూ తన చేతిలోని కేసు ఫైళ్ల కట్టను గాల్లోకి విసిరేశాడు. ఆ కాగితాలన్నీ కోర్టు హాల్లో జడ్జిల మీదుగా చెల్లాచెదురుగా పడిపోయాయి. అంతటితో ఆగకుండా, భారత ప్రధాన న్యాయమూర్తిని ఉద్దేశించి కూడా నోటికొచ్చినట్లు అసభ్య పదజాలంతో దూషించడం ప్రారంభించాడు.

**బలవంతంగా ఈడ్చేసిన సెక్యూరిటీ..**

కోర్టు హాల్లో పరిస్థితి అదుపు తప్పుతుండటంతో అక్కడ ఉన్న సుప్రీంకోర్టు భద్రతా సిబ్బంది వెనువెంటనే స్పందించారు. జడ్జీలపైకి దూసుకుపోకుండా అతడిని గట్టిగా పట్టుకుని, నియంత్రించి.. కోర్టు గది నుండి వెలుపలికి నెట్టేశారు. కోర్టు హాల్లో ఉన్న న్యాయవాదులు, ఇతర లిటిగెంట్లు ఈ హఠాత్పరిణామాన్ని చూసి షాక్‌కు గురయ్యారు. సాధారణంగా కోర్టు ధిక్కరణ లేదా న్యాయమూర్తులపై దాడికి ప్రయత్నిస్తే కఠినమైన జైలు శిక్షలు విధిస్తారు. అయితే, జస్టిస్ కేవీ విశ్వనాథన్ ధర్మాసనం సదరు వ్యక్తిపై ఎలాంటి కఠిన చర్యలకు లేదా కోర్టు ధిక్కరణ చర్యలకు నిరాకరించి పెద్ద మనసు చాటుకుంది. అతడిపై మేం ఎలాంటి చర్యలు తీసుకోవాలని అనుకోవడం లేదు. ఆ పిటిషనర్ పట్ల మాకు కేవలం సానుభూతి మాత్రమే ఉంది అని జస్టిస్ విశ్వనాథన్ పేర్కొన్నారు. అనంతరం కేసు రికార్డులను పరిశీలించి, హైకోర్టు ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోవడానికి ఎలాంటి సరైన కారణాలు లేవంటూ సదరు స్పెషల్ లీవ్ పిటిషన్ ను కోర్టు కొట్టివేసింది



## అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన భీమారం సర్పంచ్





**భీమారం(అర్జున్ సమాచారం), జూలై 10:**

స్థానిక భీమారం-5 అంగన్‌వాడీ కేంద్రంలో నాసిరకం ఆహారం, కుళ్లిన గుడ్లు సరఫరా అవుతున్నాయంటూ నిన్న (జూలై 09) సోషల్ మీడియా లో వచ్చిన కథనానికి సర్పంచ్ విజయలక్ష్మి తక్షణమే స్పందించారు. ఈ రోజు ఆమె అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, అక్కడ అందుతున్న సేవలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ విజయలక్ష్మి కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న భోజనం, పప్పు, మరియు గుడ్ల నాణ్యతను స్వయంగా పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ సిబ్బంది మరియు సూపర్ వైజర్ తో మాట్లాడుతూ.. చిన్నారుల ఆరోగ్యంతో ముడిపడి ఉన్న ఆహార విషయంలో ఎలాంటి అలసత్వం వహించకూడదని హెచ్చరించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో సర్పంచ్‌తో పాటు పంచాయతీ కార్యదర్శి, స్థానిక వార్డు సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మంథని నియోజకవర్గ కమిటీకి నూతన నియామకాలు



**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూలై 10:**

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆదేశాల మేరకు మలిదశ తెలంగాణ ఉద్యమకారులకు వివిధ బాధ్యతలు అప్పగిస్తూ మంథని నియోజకవర్గ నూతన కమిటీని నియమించారు. మంథనిలోని విద్యార్థి వేదిక కార్యాలయంలో ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంథని విజయ్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం నియామక పత్రాలను అందజేశారు. నూతన కమిటీలో ఎక్కేటి అనంతరెడ్డిని రాష్ట్ర కార్యదర్శిగా, వేల్పుల గట్టయ్యను రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా, మంథని సాయికుమార్‌ను మంథని నియోజకవర్గ యువజన విభాగం కన్వీనర్‌గా నియమించారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలకు అనుగుణంగా వారి హక్కుల సాధన కోసం నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఉద్యమకారుల సంక్షేమమే లక్ష్యంగా ఫోరాన్ని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉద్యమకారులు రామడుగు మారుతీరావు, జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రం దేవేందర్, రొడ్డ లింగయ్య, ముస్కుల ప్రభాకర్ రెడ్డి, మాదాసి అనిల్‌తో పాటు పలువురు నాయకులు, ఉద్యమకారులు పాల్గొన్నారు.

## వేధింపులు తాళలేక భర్తను కొట్టి చంపిన భార్య

**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూలై 10:**

ఎద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కదంబాపూర్ (కాశిపల్లి) గ్రామంలో కుటుంబ కలహాలు విషాదానికి దారితీశాయి. భర్త వేధింపులు తాళలేక భార్య అతడిపై దాడి చేయడంతో మృతి చెందిన ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం, గ్రామానికి చెందిన సయ్యద్ గోరేమియా, అతని భార్య గోరిబీ మధ్య గత ఏడాది కాలంగా కుటుంబ కలహాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో గోరేమియా కొంతకాలంగా జగిత్యాలలో ఉంటూ, రెండు రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. గురువారం రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చిన గోరేమియా భార్యతో మరోసారి గొడవకు దిగినట్లు సమాచారం. వేధింపులు భరించలేక గోరిబీ మట్టి పెళ్లతో భర్త తలపై బలంగా కొట్టడంతో అతడు అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం



అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనకు సంబంధించి గోరిబీతో పాటు ఆమె కుమారుడు సయ్యద్ అలీని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ప్రాథమిక విచారణలో కుటుంబ వేధింపుల కారణంగానే ఈ ఘటన జరిగినట్లు పోలీసులు వెల్లడించారు.

# తెలంగాణ పోలీస్ క్రీడల్లో కమాన్‌పూర్ మహిళా కానిస్టేబుల్ శ్రీలత ప్రతిభ

## మూడు పతకాలు కైవసం.. మరోసారి సత్తా చాటిన యోగా క్రీడాకారిణి

పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూలై 10




తెలంగాణ పోలీస్ శాఖ నిర్వహించిన ఐదవ తెలంగాణ పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌లో కమాన్‌పూర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన మహిళా కానిస్టేబుల్ కూరపాటి శ్రీలత విశిష్ట ప్రతిభ కనబరిచారు. హైదరాబాద్‌లోని మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఈ నెల 7 నుంచి 9 వరకు జరిగిన క్రీడల్లో ఆమె మూడు పతకాలు సాధించి రామగుండం పోలీస్ కమిషనరేట్‌కు గౌరవం తీసుకువచ్చారు.కాళేశ్వరం జోన్‌కు ప్రాతినిధ్యం వహించిన శ్రీలత యోగా ట్రెడిషనల్ విభాగంలో స్వర్ణ పతకం, యోగా ఆర్టిస్టిక్ సింగిల్ విభాగంలో రజత పతకం, యోగా రిథమిక్ పెయిర్ విభాగంలో కాంస్య పతకం సాధించారు. ఈ పోటీల్లో కాళేశ్వరం, రాజన్న సిరిసిల్ల, భద్రాద్రి కొత్తగూడెం, బాసర, యాదాద్రి, చార్మినార్, జోగులాంబ తదితర జోన్లకు చెందిన పోలీస్ క్రీడాకారులు పాల్గొన్నారు.విజేతలకు మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్ అధికారులు పతకాలు అందజేసి అభినందించారు. గతంలో హర్యానాలో నిర్వహించిన జాతీయ స్థాయి పోలీస్ క్రీడల్లో కూడా శ్రీలత పతకం సాధించి తన ప్రతిభను చాటుకున్నారు.తాజాగా తెలంగాణ స్థాయి పోటీల్లో మూడు పతకాలు సాధించిన శ్రీలతను రామగుండం పోలీస్ కమిషనరేట్ అధికారులు, సహచర పోలీస్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, స్థానికులు అభినందించారు.

# నిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించిన పుట్ట మధు

## ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే



పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూలై 10

హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు శుక్రవారం పరామర్శించారు.కమాన్‌పూర్ మండలం పేరపల్లి గ్రామానికి చెందిన ఆకుల కుమార్ కుమారుడు ఆకుల సాత్విక్‌ను కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే మల్హార్ మండలం వల్లెంకుంట గ్రామానికి చెందిన మెట్టు తిరుపతి భార్య సౌజన్యను కూడా పరామర్శించి వైద్యులతో మాట్లాడారు.బాధితులకు మెరుగైన వైద్యం అందించి త్వరగా కోలుకునేలా అన్ని చర్యలు తీసుకోవాలని వైద్యులను కోరారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని పుట్ట మధు హామీ ఇచ్చారు.

# ఇందారం కూడలిలో హెచ్చరిక పలకలు ఏర్పాటు

## ప్రమాదాల నివారణే లక్ష్యంగా జైపూర్ పోలీసుల చొరవ..

## నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరిక!

అర్జున్ సమాచారం జులై 10 మంచిర్యాల ప్రతినిధి:

జైపూర్ మండలంలోని ఇందారం కూడలిలో తరచూ చోటుచేసుకునే రోడ్డు ప్రమాదాలను అరికట్టే లక్ష్యంతో జైపూర్ పోలీసు సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఎస్ఐ భూమేష్ ఆధ్వర్యంలో ప్రమాద హెచ్చరిక పలకను ఏర్పాటు చేసి వాహనదారులు, దుకాణదారులకు అవగాహన కల్పించారు. వాహనాలు నిలిపివేయడం, రోడ్డు పక్కనే అల్పాహార బండ్లు ఏర్పాటు చేయడం వల్ల రాకపోకలకు ఆటంకం ఏర్పడి ప్రమాదాలు సంభవించే అవకాశాలు పెరుగుతున్నాయని తెలిపారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని హెచ్చరిక పలకను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రహదారిపై ఎలాంటి వ్యాపార కార్యకలాపాలు నిర్వహించవద్దని, వాహనాలను రహదారిపై నిలపకుండా నిర్దేశిత ప్రదేశాల్లోనే నిలిపివేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ రవాణా నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. ప్రజల ప్రాణ భద్రతే పోలీసు శాఖకు అత్యంత ప్రాధాన్యమని పేర్కొన్న ఎస్ఐ భూమేష్, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంతో ఇందారం కూడలిలో ప్రమాదాల నివారణకు మరింత భద్రత కల్పించాలనే లక్ష్యంతో పోలీసులు ముందుకు సాగుతున్నారని స్థానికులు అభిప్రాయపడ్డారు.




# పీఓకేలో ఆందోళనలు తీవ్రం

న్యూఢిల్లీ, జూలై 10, (అర్జున్ సమాచారం ప్రతినిధి)



పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ కొన్ని రోజులుగా అట్టుడుకుతోంది. గత కొన్ని రోజులుగా పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. పాకిస్తాన్ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా రావల్కోట్ సహా పలు ప్రాంతాల్లో వేలాది మంది ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసనలు చేపడుతున్నారు. ధరల పెరుగుదల, విద్యుత్ కొరత, పరిపాలనా సమస్యలు, మౌలిక సదుపాయాల లోపం వంటి అంశాలపై ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఈ పరిణామాలు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో నెలకొన్న అసంతృప్తిని మరోసారి వెలుగులోకి తెచ్చాయి.స్థానిక వర్గాల ప్రకారం, నిరసనలను నియంత్రించేందుకు పాకిస్తాన్ అధికారులు కఠిన చర్యలు తీసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆహారం, ఇతర నిత్యావసర వస్తువుల సరఫరాపై ఆంక్షలు విధించారని కొందరు స్థానిక నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొందరు నాయకులు అంతర్జాతీయ సమాజం దృష్టి ఈ అంశంపై పడాలని కోరుతున్నారు. రక్షణ విశ్లేషకుడు, రిటైర్డ్ లెఫ్టినెంట్ కల్నల్ జె.ఎస్. సోధి మాట్లాడుతూ, పాకిస్తాన్ పాలనపై ప్రజల్లో అసంతృప్తి చాలా కాలంగా ఉందని అభిప్రాయపడ్డారు. అయితే, ఆయన చేసిన రాజకీయ విశ్లేషణలు వ్యక్తిగత అభిప్రాయాలేనని గమనించాలి. భవిష్యత్తులో అక్కడ మరింత పెద్ద ఉద్యమం చెలరేగే అవకాశం ఉందని ఆయన వ్యాఖ్యానించారు.2023లో ఏర్పాటైన జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రజలు మొత్తం 38 డిమాండ్లను ప్రభుత్వం ముందుంచారు. ఈ కమిటీలో రవాణా రంగ ప్రతినిధులు, దుకాణదారులు, చిన్న వ్యాపారులు, పదవీ విరమణ చేసిన ఉద్యోగులు తదితరులు ఉన్నారు. పెన్షన్ల చెల్లింపు, పిండి, విద్యుత్ ధరల తగ్గింపు, మెరుగైన ఆరోగ్య సేవలు, మీర్‌పూర్‌లో అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణం, విద్యుత్ మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆస్తుల బదిలీలపై పన్నుల తగ్గింపు వంటి అంశాలు ప్రధాన డిమాండ్లలో ఉన్నాయి. స్థానికులు, గత రెండేళ్లలో జరిగిన నిరసనల సందర్భంగా మరణించిన వారి కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలని కూడా డిమాండ్ చేస్తున్నారు. అలాగే విద్యుత్ ఉత్పత్తిలో కీలక ప్రాంతంగా ఉన్నప్పటికీ, విద్యుత్ కొరత కొనసాగుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇదిలావుంటే, భారతదేశం అధికారికంగా మొత్తం జమ్మూ-కాశ్మీర్, లడఖ్‌తో పాటు పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌ను కూడా భారత అంతర్భాగంగానే పరిగణిస్తోంది. అయితే ప్రస్తుతం పరిపాలన పాకిస్తాన్ ఆధీనంలో కొనసాగుతోంది. ఈ అంశం భారత్-పాకిస్తాన్ మధ్య దీర్ఘకాలిక వివాదంలో భాగంగా ఉంది. ప్రస్తుతం జరుగుతున్న నిరసనలు, ప్రజల డిమాండ్లు, అక్కడి పరిస్థితులు ప్రాంతీయ రాజకీయాల్లో మరోసారి చర్చనీయాంశంగా మారాయి. పరిస్థితిపై పలు వర్గాలు నిశితంగా గమనిస్తున్నాయి. అయితే అక్కడి పరిస్థితులపై వస్తున్న అనేక ఆరోపణలు, రాజకీయ వ్యాఖ్యానాలు స్వతంత్రంగా పూర్తిగా ధృవీకరించలేదు.

# తయారీ రంగానికి తెలంగాణ అత్యంత అనుకూలం

## జర్మన్ పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహించాలి: శ్రీధర్ బాబు

పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూలై 10




తయారీ రంగంలో పరిశ్రమల ఏర్పాటుకు దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ అత్యంత అనుకూలమని, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేలా జర్మన్ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు.శుక్రవారం డా. బీఆర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో బవేరియా (జర్మనీ) ఆర్థిక వ్యవహారాలు, ప్రాంతీయ అభివృద్ధి, ఇంధన శాఖ వైస్ మంత్రి టోబియాస్ గోత్‌హార్ట్ నేతృత్వంలోని జర్మనీ ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా తెలంగాణ--జర్మనీ మధ్య ద్వైపాక్షిక సంబంధాల విస్తరణ, పారిశ్రామిక పెట్టుబడులు, సాంకేతిక సహకారంపై విస్తృతంగా చర్చించారు.పెట్టుబడులకు అనుకూలమైన పారిశ్రామిక విధానాలు, ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, నైపుణ్యం కలిగిన మానవ వనరులతో తెలంగాణను ప్రపంచ స్థాయి తయారీ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పనిచేస్తోందని మంత్రి తెలిపారు.లైఫ్ సైన్సెస్, బయోటెక్నాలజీ, ఏరోస్పేస్, రక్షణ రంగం, ఆధునిక తయారీ, ప్రెసిషన్ ఇంజినీరింగ్, డిజిటల్ ఇంజినీరింగ్, సెమీకండక్టర్లు, ఆటోమొబైల్--మొబిలిటీ, కృత్రిమ మేధస్సు, డిజిటల్ హెల్త్, పరిశోధన--ఆవిష్కరణలు, స్వచ్ఛ ఇంధనం, ప్రపంచ సామర్థ్య కేంద్రాలు, ఇండస్ట్రీ 4.0 వంటి రంగాల్లో తెలంగాణలో విస్తృత పెట్టుబడి అవకాశాలు ఉన్నాయని వివరించారు.అత్యాధునిక సాంకేతికత, పరిశోధన, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా సమగ్ర పారిశ్రామిక వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. పెట్టుబడులతో పాటు సాంకేతికత, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి రంగాల్లోనూ తెలంగాణ--జర్మనీ భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.ఈ సమావేశంలో జర్మనీ కాన్సుల్ జనరల్ మైఖేల్ హాస్పర్, హైదరాబాద్‌లో జర్మనీ గౌరవ కాన్సుల్ అమితా దేశాయ్, బవేరియా ఆర్థిక శాఖ కార్యనిర్వాహక సంచాలకురాలు ఉల్రికే హాఫ్‌మన్, బవేరియా ఇండియా కార్యాలయ కార్యనిర్వాహక సంచాలకుడు జాన్ కొట్టాయిల్ తదితరులు పాల్గొన్నారు.

# భీమారంలో ఓటర్లకు అందని 'సర్' ఫారాలు!

# నత్త నడకన సాగుతున్న సర్ ప్రక్రియ

## ఎప్పుడు ఇస్తారని ప్రశ్నిస్తున్న ఓటర్లు

## జూలై 24 ఆఖరి గడువు.. ఇంకా మెజారిటీ ఓటర్లకు అందని వైనం

భీమారం(మంచిర్యాల), అర్జున్ సమాచారం, జూలై 10:




ఓటరు జాబితా పారదర్శకత, సవరణల కోసం కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'సర్' ( ప్రత్యేక సమగ్ర పునశ్చరణ) కార్యక్రమం భీమారం మండలంలో నత్తనడకన సాగుతోంది. ఓటర్ల వివరాల వెరిఫికేషన్ కోసం పంపిణీ చేయాల్సిన 'సర్' ఫారాలు ఇప్పటివరకు మండలంలోని మెజారిటీ ఓటర్లకు చేరకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఓటరు జాబితాను పక్కాగా రూపొందించేందుకు ఈ ప్రక్రియ ఎంతో కీలకమైనప్పటికీ, క్షేత్రస్థాయిలో సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ఓటర్లు అయోమయానికి గురవుతున్నారు.మండలంలోని కొన్ని ప్రాంతాల్లో బూత్ లెవెల్ అధికారులు (బిఎల్ఓ) ఇంటికి వచ్చి కేవలం ఒక్క ఫారం మాత్రమే ఇచ్చి వెళ్లారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇంట్లో నలుగురు, ఐదుగురు ఓటర్లు ఉన్నప్పటికీ అందరికీ సర్ ఫారాలు రాకపోవడం తో ఇది ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఒక వేల చివరి నిమిషం లో ఫారాలు ఇస్తే వాటిని ఎలా పూరించాలి, 2002 లిస్ట్ ఎక్కడ ఉంది ఎలా నింపాలి అనే ప్రశ్నలు ప్రజల్లో మెదులుతున్నాయి. అసలు ఈ ఫారాలను ఎప్పుడు పూర్తి స్థాయిలో పంపిణీ చేస్తారనే దానిపై ఎలాంటి స్పష్టత కరువైంది.తమ ఓటు హక్కును భద్రపరుచుకోవాలనే ఆసక్తితో, సందేహాలను నివృత్తి చేసుకునేందుకు ఓటర్లు బీఎల్ఓలకు ఫోన్లు చేస్తుంటే కనీసం స్పందన కరువైంది. చాలా చోట్ల అధికారుల ఫోన్లు కలవడం లేదని, మరికొన్ని చోట్ల ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోందని ఓటర్లు వాపోతున్నారు. క్షేత్రస్థాయిలో ఇంత జరుగుతున్నా ఉన్నతాధికారులు ఎందుకు సమీక్షించడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, భీమారం మండలంలో 'సర్' ఫారాల పంపిణీ సక్రమంగా జరిగేలా చూడాలని, బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# విద్యాబోధనలో ప్రతి ఉపాధ్యాయుడు నైపుణ్యం సాధించాలి: జిల్లా విద్యాధికారి శారద

పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూలై 10

విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించేందుకు ప్రతి ఉపాధ్యాయుడు బోధనా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని పెద్దపల్లి జిల్లా విద్యాధికారి జి. శారద అన్నారు. శుక్రవారం కమాన్‌పూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న మూడు రోజుల ఉపాధ్యాయుల వృత్త్యంతర శిక్షణా కార్యక్రమాన్ని ఆమె సందర్శించి శిక్షణ తీరును పరిశీలించారు.విద్యాశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో భాగంగా రామగుండం, మంథని, కమాన్‌పూర్, ముత్తారం, రామగిరి మండలాలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శారద మాట్లాడుతూ విద్యావ్యవస్థలో వస్తున్న నూతన మార్పులను ఉపాధ్యాయులు అవగాహన చేసుకుని వాటిని తరగతి గదిలో సమర్థంగా అమలు చేయాలని సూచించారు. ముఖ్యంగా హిందీ భాష బోధనలో అన్ని సామర్థ్యాలను విద్యార్థులు సాధించేలా కృషి చేయాలని తెలిపారు.ఏఎంఓ షేక్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని వసతులను సద్వినియోగం చేసుకునేలా ఉపాధ్యాయులు మార్గనిర్దేశం చేయాలని, భాషా సామర్థ్యాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు.మండల విద్యాధికారి ఇల్లందుల విజయ్ కుమార్ మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను ప్రతి ఉపాధ్యాయుడు తమ పాఠశాలల్లో సమర్థంగా అమలు చేసి విద్యార్థుల అభ్యాస ఫలితాలను మెరుగుపరచాలని కోరారు. ఈ శిక్షణా కార్యక్రమంలో డీఆర్‌పీలు సమీవుల్లా ఖాన్, రఫీ, మంజుల, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.




PRGI NO: TGTEL/25/A5514
అర్జున్ సమాచారం
www.arjunsamaachaaram.in
తెలుగు దినపత్రిక
సినిమా
CINEMA



# 70 ఏళ్ల వయసులోనూ తగ్గని జోష్.. 'మెగా 158' కోసం వర్షంలో 12 గంటల పాటు చిరంజీవి!

మెగాస్టార్ చిరంజీవి అంకితభావానికి వయసు అడ్డుకాదని మరోసారి నిరూపించారు. 70 ఏళ్ల వయసులోనూ యువ హీరోలకు ఏమాత్రం తీసిపోని ఉత్సాహంతో వరుస సినిమాలు చేస్తూ అభిమానులను అలరిస్తున్నారు. ప్రస్తుతం దర్శకుడు బాబీ కొల్లి తెరకెక్కిస్తున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో నటిస్తున్న చిరంజీవి, సినిమా కోసం పడుతున్న కష్టం ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం 'మెగా 158' వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ చిత్రం రెండో షెడ్యూల్ హైదరాబాద్‌లో శరవేగంగా సాగుతోంది. ఈ షెడ్యూల్ కోసం ప్రత్యేకంగా రూపొందించిన భారీ సెట్‌లో హై వోల్టేజ్ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఇందులో భాగంగా వర్షంలో జరిగే ఓ కీలక యాక్షన్ ఎపిసోడ్‌ను దర్శకుడు బాబీ ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నారు





# 'లెనిన్' ఫస్ట్ టాక్ వచ్చేసింది.. ఎన్టీఆర్ వాయిస్ ఓవర్‌తో అదిరిపోయిన ఆరంభం!

అక్కినేని అఖిల్ హీరోగా దర్శకుడు మురళీకిషోర్ అబ్బూరు తెరకెక్కించిన 'లెనిన్' చిత్రం ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అమెరికాలో తెల్లవారుజామున ప్రీమియర్ షోలు ప్రదర్శించగా, అక్కడి ప్రేక్షకుల నుంచి మొదటి స్పందన సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ముఖ్యంగా అఖిల్ కెరీర్‌లో ఇది ఒక కీలకమైన సినిమా కావడంతో అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూశారు. తొలి షోల తర్వాత వస్తున్న రిపోర్టులు చిత్రంపై పాజిటివ్ బజ్‌ను క్రియేట్ చేస్తున్నాయి.సినిమా ప్రారంభంలో వినిపించే మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ వాయిస్ ఓవర్ ప్రేక్షకులను వెంటనే కథలోకి తీసుకెళ్తోందని ప్రీమియర్ చూసిన వారు చెబుతున్నారు. కథలోని ప్రధాన అంశాన్ని ఎన్టీఆర్ తన గంభీరమైన గళంతో పరిచయం చేసిన తీరు సినిమాకు మంచి హైప్‌ను తీసుకొచ్చిందని సోషల్ మీడియాలో పోస్టులు కనిపిస్తున్నాయి

# అవినీతిపరులకు సింహస్వప్నం


అగ్ర కథానాయకుడు నందమూరి బాలకృష్ణ నటిస్తున్న 'చీదీఖ 111'(వర్కింగ్ టైటిల్)లో కాజల్ అగర్వాల్ కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఇటీవలే ఆమె పాత్రకు సంబంధించిన ఫస్ట్‌లుక్‌ని కూడా మేకర్స్ విడుదల చేశారు. ఇందులో ఆమె పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తున్నట్టు వార్తలు కూడా వచ్చాయి. తన లేటెస్ట్ ఇంటర్వ్యూలో ఆ పాత్ర గురించి కాజల్ మాట్లాడారు. బాలకృష్ణ 'నేలకొండ భగవంత్ కేసరి' సినిమాలో ఫన్నీగా కనిపించిన తాను, 'చీదీఖ 111'లో మాత్రం సీరియస్ పాత్ర పోషిస్తున్నట్టు ఆ ఇంటర్వ్యూలో కాజల్ పేర్కొన్నారు.ఫిల్మ్‌వర్గాల సమాచారం ప్రకారం ఇందులో ఆమె నిజాయతీ గల ప్రభుత్వ అధికారిగా కనిపిస్తుందట. అవినీతిపరుల గుండెల్లో వణుకు పుట్టించేలా ఆ పాత్ర సాగుతుందని ఇన్‌సైడ్ టాక్. ఇందులో బాలకృష్ణ, కాజల్ కాంబినేషన్ సీన్స్ భావోద్వేగపూరితంగా ఉంటాయట. కాజల్ కెరీర్‌లో ఇప్పటివరకూ కనిపించని భిన్నమైన పాత్ర ఇదని తెలుస్తున్నది. నిజానికి ఈ పాత్రకు ముందు నయనతారను అనుకున్నారు.

# రష్మిక అరుదైన ఫీట్

'మైసా' సినిమా కోసం తీవ్రంగా శ్రమిస్తున్నది అగ్ర కథానాయిక రష్మిక మందన్న. ఈ యాక్షన్ థ్రిల్లర్‌లో ధైర్యసాహసాలు మూర్తీభవించిన గిరిజన మహిళగా ఆమె కనిపించనున్న విషయం తెలిసిందే. మహిళా ప్రధాన కథాంశంతో తెరకెక్కుతున్న ఈ సినిమాలో పోరాట ఘట్టాలు ప్రధానాకర్షణగా నిలుస్తాయని చెబుతున్నారు. ఈ సినిమా కోసం బ్యాంకాక్‌లో మార్షల్ ఆర్ట్స్‌లో ట్రెయినింగ్ తీసుకుంది రష్మిక మందన్న. డూప్‌లేకుండా స్వయంగా పోరాట ఘట్టాల్లో పాల్గొన్నది. తాజాగా ఆమె భారతీయ సినిమాలో ఇప్పటివరకూ ఎవరూ చేయని ఓ అరుదైన ఫీట్‌ని సొంతం చేసుకుంది. 'మైసా' కోసం రెండు రోజుల్లో దాదాపు 20 గంటల పాటు అత్యంత క్లిష్టమైన అండర్ వాటర్ ఫైట్ సీక్వెన్స్‌ను చిత్రీకరించారు.

# ఆగస్ట్‌లో వస్తున్న 'అగధ'

అగ్ర నిర్మాతగా ఎన్నో భారీ విజయాల్ని తన ఖాతాలో వేసుకున్నారు ఎమ్మెస్ రాజు. 'డర్టీహరి' 'మళ్లీపెళ్లి' వంటి సినిమాలతో దర్శకుడిగా కూడా రాణించారాయన. ఎమ్మెస్ రాజు దర్శకత్వంలో రూపొందుతున్న తాజా చిత్రం 'అగధ'. కామాక్షి భాస్కర్ల, శ్రవణ్ రెడ్డి, ఉల్కా గుప్తా, జోవికా విజయ్ కుమార్ ప్రధాన తారాగణం. మిస్టిక్ డివైన్ థ్రిల్లర్‌గా రూపొందిస్తున్న ఈ చిత్రాన్ని ఆగస్ట్ 14న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెస్ రాజు మాట్లాడుతూ 'ఇది నా డ్రీమ్ ప్రాజెక్ట్. మైథలాజికల్, మిస్టరీ, థ్రిల్లింగ్ అంశాలతో తెరకెక్కించాం. విజువల్ వండర్‌లా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినందిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల చేయబోతున్నాం' అన్నారు. అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో ఈ సినిమాను తీశామని నిర్మాత కాశీ విశాలాక్షి బలుసు తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: రాకేష్ వెంకటాపురం, ప్రొడక్షన్ డిజైనర్: రాజీవ్ నాయర్, నిర్మాణం: శ్రీ ఆది వరాహ ప్రొడక్షన్స్, దర్శకత్వం: ఎమ్మెస్ రాజు.







# డిసెంబర్‌తో బన్నీ పార్ట్ పూర్తి?

ప్రస్తుతం అగ్ర కథానాయకుడు అల్లు అర్జున్ 'రాకా' షూట్‌లో బిజీగా ఉన్నారు. కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ పాన్ ఇండియా చిత్రం హైదరాబాద్ కేంద్రంగా శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్నది. ఇందులో విభిన్న కోణాలతో కూడిన పాత్రను బన్నీ పోషిస్తున్నారు. సైన్స్‌ఫిక్షన్ నేపథ్యంలో అంతర్జాతీయ స్థాయి సాంకేతిక విలువలతో తెరకెక్కుతున్న ఈ సినిమాలో దీపిక పదుకోన్ కథానాయిక. మృణాల్‌ఠాకూర్, జాన్వీ కపూర్ ప్రత్యేక పాత్రలు పోషిస్తున్నట్టు సమాచారం.ఇటీవలే విడుదలైన తోడేలు చేతులతో కూడిన బన్నీ ఫస్ట్‌లుక్ ఫిల్మ్ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఈ కథతో తోడేలుకు ఉన్న సంబంధం అంతర్జాతీయ మీడియాలో చర్చనీయాంశమైంది. ఇదిలావుంటే.. ముందుగా అనుకున్న ఒప్పందం ప్రకారం ఈ ఏడాది డిసెంబర్‌లో ఈ సినిమాలోని అల్లు అర్జున్ పార్ట్ మొత్తం అట్లీ పూర్తి చేయనున్నారు.



# వర్షాకాల వ్యాధుల నివారణకు ఇంటింటి అవగాహన కార్యక్రమం

## గ్రామ పరిశుభ్రతతోనే ఆరోగ్యకరమైన జీవనం: సర్పంచ్ కొండవెన దివ్యసుధాకర్ యాదవ్







**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూలై 10:**

రామగిరి మండలంలోని నాగేపల్లి గ్రామంలో వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామ సర్పంచ్ కొండవెన దివ్యసుధాకర్ యాదవ్ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి గ్రామ ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు, దోమల ద్వారా వ్యాపించే జ్వరాలు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవడం, ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవడం, తాగునీటిని తప్పనిసరిగా మరిగించి తాగడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం వంటి అంశాలపై ప్రజలకు వివరించారు. వ్యాధుల నివారణలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచితేనే ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని సర్పంచ్ తెలిపారు. "మన గ్రామం -- మన బాధ్యత, పరిశుభ్రమైన గ్రామమే ఆరోగ్యకరమైన గ్రామం" అనే నినాదంతో గ్రామస్తులు పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చారు.

# కాంగ్రెస్ నాయకుడు చొప్పరి సదానందం పితృవియోగం కేశనపల్లిలో విషాదం..

**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూలై 10:**



ముత్తారం మండలం కేశనపల్లి గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు, ముత్తారం మండల మాజీ జిల్లా పరిషత్ ప్రాదేశిక సభ్యుడు చొప్పరి సదానందం తండ్రి చొప్పరి లింగయ్య (82) శుక్రవారం ఉదయం స్వగృహంలో కన్నుమూశారు. గత కొంతకాలంగా వృద్ధాప్య సంబంధిత అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన పరిస్థితి విషమించడంతో తుదిశ్వాస విడిచారు. లింగయ్య మృతితో కేశనపల్లి గ్రామంతో పాటు ముత్తారం మండలంలో విషాద ఛాయలు అలముకున్నాయి. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉంటూ అందరితో ఆప్యాయంగా మెలిగే వ్యక్తిగా ఆయనకు మంచి గుర్తింపు ఉంది. ఆయన మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. లింగయ్య మృతిపట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ రంగాల ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. చొప్పరి సదానందం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, లింగయ్య ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. లింగయ్య అంత్యక్రియలు శనివారం కేశనపల్లి గ్రామంలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

# జాతీయ నులిపురుగు దినోత్సవం సందర్భంగా ఆల్బెండాజోల్ మాత్రల పంపిణీ

**ఒకటి నుంచి 19 సంవత్సరాల పిల్లలకు ఉచితంగా మందు పంపిణీ**

**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూలై 10:**

జూలై 13న నిర్వహించనున్న జాతీయ నులిపురుగు దినోత్సవం సందర్భంగా రామగిరి మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఒకటి నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఆల్బెండాజోల్ 400 మిల్లీగ్రాముల మాత్రలు వేయనున్నట్లు బేగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి తెలిపారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు రాని పిల్లలకు ఆశ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ఆల్బెండాజోల్ మాత్రలు అందించి వేయనున్నట్లు పేర్కొన్నారు. పిల్లల్లో నులిపురుగుల నివారణ, ఆరోగ్య పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి తల్లిదండ్రులు సహకరించి, అర్హులైన ప్రతి చిన్నారికి తప్పనిసరిగా మాత్రలు వేయించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# కమిషనర్ సంతకం నకిలీ.. సమీండ్ల రాజేష్‌పై కేసు..

**అర్జున్ సమాచారం జులై 10రూరల్ ప్రతినిధి జగిత్యాల**

జగిత్యాల మున్సిపాలిటీలో కమిషనర్ సంతకం ఫోర్జరీ వ్యవహారం కీలక మలుపు తిరిగింది. మున్సిపల్ కమిషనర్ ఫిర్యాదు మేరకు జగిత్యాల టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. హౌస్ నంబర్ 3-5-128కు సంబంధించిన అసెస్‌మెంట్ సర్టిఫికెట్‌ను నకిలీగా తయారు చేసి, కమిషనర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి, అదే పత్రాన్ని సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆస్తి రిజిస్ట్రేషన్ కోసం ఉపయోగించిందంటూ సమీండ్ల రాజేష్‌పై ఆరోపణలు ఉన్నాయి. ఈ ఫిర్యాదుపై అన్ని కోణాల్లో విచారణ చేపట్టిన పోలీసులు, దర్యాప్తులో వాస్తవాలు నిర్ధారణ అయితే సంబంధిత నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

# రత్నాపూర్ గౌడ సంఘానికి న్యాయం చేస్తాం: తొట్ల తిరుపతి యాదవ్

## పరిహారం కోసం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు దృష్టికి సమస్యను తీసుకెళ్తామని హామీ

**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూలై 10:**



రామగిరి మండలం రత్నాపూర్ గౌడ సంఘానికి చెందిన భూమికి సంబంధించిన నష్టపరిహారాన్ని తక్షణమే చెల్లించాలని కోరుతూ సంఘం సభ్యులు మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్‌కు వినతిపత్రం అందజేశారు. బుధవారం అర్ధరాత్రి రామగిరి మండలంలోని మంథని బ్లాక్ కాంగ్రెస్ కార్యాలయంలో ఆయనను కలిసి తమ సమస్యను వివరించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం సభ్యులు మాట్లాడుతూ, రత్నాపూర్ గౌడ సంఘానికి చెందిన సర్వే నంబర్ 152లోని ఐదు ఎకరాల భూమిని ప్రభుత్వం ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కోసం సేకరించినప్పటికీ, ఇప్పటి వరకు సంఘానికి ఎలాంటి నష్టపరిహారం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులతో మాట్లాడి తమకు రావాల్సిన నష్టపరిహారాన్ని త్వరితగతిన మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రంపై స్పందించిన మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ మాట్లాడుతూ, సమస్యను తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లి సంబంధిత అధికారులతో మాట్లాడతానని తెలిపారు. గౌడ సంఘానికి న్యాయం జరిగేలా, నష్టపరిహారం త్వరితగతిన అందేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల పరిషత్ అధ్యక్షురాలు ఆరెల్లి దేవక్క కొమురయ్య, రామగిరి మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు కండె పోషం, రత్నాపూర్ గౌడ సంఘం నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నాగేపల్లిలో భారీ కాలువ శుభ్రపరిచిన సర్పంచ్ దివ్యసుధాకర్ యాదవ్

## వర్షాకాల సమస్యల నివారణకు ముందస్తు చర్యలు




**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూలై 10:**

రామగిరి మండలం నాగేపల్లి గ్రామంలో గ్రామ ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వ పాఠశాల వెనుక ఉన్న ప్రధాన కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారం, డ్రైనేజీ వ్యర్థాలు, పూడికను శుక్రవారం జేసీబీ సహాయంతో పూర్తిస్థాయిలో తొలగించారు. గ్రామ సర్పంచ్ కొండవెన దివ్యసుధాకర్ యాదవ్ ఆధ్వర్యంలో ఈ పనులు చేపట్టారు. కాలువలో చెత్త, పూడిక పేరుకుపోవడంతో వర్షపు నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడటంతో పాటు దోమలు, పాములు గ్రామంలోకి వచ్చే ప్రమాదం ఉన్న నేపథ్యంలో ముందస్తు చర్యగా కాలువను శుభ్రం చేయించారు. దీంతో వర్షపు నీరు సజావుగా వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొండవెన దివ్యసుధాకర్ యాదవ్ మాట్లాడుతూ, గ్రామంలో పరిశుభ్రమైన వాతావరణం నెలకొనేలా, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన పారిశుద్ధ్య పనులను నిరంతరం చేపడతామని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి స్వప్న, ఐదో వార్డు సభ్యుడు గొల్లపల్లి సాహిత్య నరేష్, తొమ్మిదో వార్డు సభ్యుడు రామిండ్ల గోపాలకృష్ణ, సీనియర్ నాయకుడు గొల్లపల్లి రాయమల్లు పాల్గొన్నారు.

# విశ్రాంత ఉద్యోగుల ఐక్యతతోనే హక్కుల పరిరక్షణ

## ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని జిల్లా సంఘం పిలుపు.

**అర్జున్ సమాచారం జులై 10 మంచిర్యాల ప్రతినిధి:**

జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో త్వరలో జరగనున్న ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలనే లక్ష్యంతో సంఘం నాయకులు విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని సూర్యనగర్‌లో విశ్రాంత ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. మాజీ కార్మిక నాయకుడు మియాపురం వీరాచారి అధ్యక్షతన జరిగిన సమావేశానికి జిల్లా సంఘం అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, గౌరవ అధ్యక్షుడు రాళ్లబండి రాజన్న, ప్రధాన కార్యదర్శి పూదరి నరసయ్య, ఉపాధ్యక్షుడు గంగన్న, సూర్యనగర్ నాయకులు గంధం శంకర్, పార్వతి లింగయ్య, దండవేణి లక్ష్మణ్, మొధుపురం వెంకటేశ్వర్లు, ఈ. రాజేశం, అల్లి శంకర్, ఎస్. వెంకటేశ్వర్లు, ఐ. శంకర్, పలువురు విశ్రాంత ఉద్యోగులు హాజరయ్యారు. ఈ



సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలకు ఐక్య పోరాటమే శాశ్వత పరిష్కారమని పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధిగమించాలంటే అందరూ ఒకే వేదికపై నిలవాలని పిలుపునిచ్చారు. రావలసిన హక్కులు, సంక్షేమ ప్రయోజనాల సాధనకు సంఘటిత శక్తి ఎంతో అవసరమని స్పష్టం చేశారు. త్వరలో జిల్లా స్థాయిలో భారీ ఎత్తున ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి విశ్రాంత ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం, సంబంధిత యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు వెల్లడించారు. సూర్యనగర్‌కు చెందిన విశ్రాంత ఉద్యోగులు సంఘం పిలుపునకు పూర్తి మద్దతు ప్రకటించారు. ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేసేందుకు తమవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. చివరగా "సింగరేణి విశ్రాంత ఉద్యోగుల ఐక్యత వర్ధిల్లాలి" అనే నినాదాలతో సమావేశం ముగిసింది.

# న్యూ ఏజింగ్ టాప్ ప్రయారిటీ

**న్యూఢిల్లీ, జూలై 10, (అర్జున్ సమాచారం ప్రతినిధి)**

వయసు పెరగడం మానవ జీవితంలో అనివార్యమైన భాగం. కానీ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఈ ప్రక్రియను మందగించి, ఆరోగ్యకరమైన జీవితకాలాన్ని పెంచడానికి భారీగా పెట్టుబడులు పెడుతున్నారు. ఇందుకోసం సుమారు 26 బిలియన్ డాలర్లు (సుమారు 2 లక్షల కోట్ల రూపాయలు) ఖర్చు చేస్తూ ఒక జాతీయ శాస్త్రీయ కార్యక్రమాన్ని నడుపుతున్నారు. 2025లో బీజింగ్‌లో జరిగిన సైనిక కవాతు సందర్భంగా పుతిన్ చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో అవయవాల మార్పిడి ద్వారా మనుషులు యువతను నిలుపుకోవచ్చని, బహుశా అమరత్వం కూడా సాధ్యమవుతుందని చర్చించినట్లు హాట్ మైక్ రికార్డింగ్ ద్వారా బయటపడింది. ఈ చర్చ 2024లో అధికారికంగా ప్రారంభమైన 'న్యూ హెల్త్ ప్రిజర్వేషన్ టెక్నాలజీస్' ప్రాజెక్టుకు సంబంధించినదిగా విశ్లేషకులు భావిస్తున్నారు. రష్యా ప్రభుత్వం దీనిని టాప్ ప్రయారిటీ శాస్త్రీయ కార్యక్రమంగా ప్రకటించిందిఈ కార్యక్రమం అనేక అధునాతన రంగాలపై దృష్టి పెట్టింది. కణాల వృద్ధాప్యాన్ని నెమ్మది చేసే చికిత్సల అభివృద్ధి. ఇది ప్రాజెక్టులో కీలక భాగం. కణజాలాలు, అవయవాలను 3డీ ప్రింటింగ్ ద్వారా తయారు చేయడం. ఇప్పటికే ఎలుకల థైరాయిడ్ గ్రంథి, మానవ కార్టిలేజ్ విజయవంతంగా ప్రింట్ చేశారు. 2030 నాటికి పూర్తి మానవ అవయవాలను సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. జన్యుపరంగా మార్చిన మినీ పందులలో మానవ అనుకూల అవయవాలు పెంచి, మనుషులకు మార్పిడి చేయడం. ఇది అవయవాల కొరతను తగ్గించడానికి సహాయపడుతుంది. క్రయోథెరపీ ఇవి కణాలను రక్షించడానికి ఉపయోగపడతాయి. ఈ సాంకేతికతలు ప్రపంచవ్యాప్తంగా (ముఖ్యంగా సిలికాన్ వ్యాలీలో) జరుగుతున్న పరిశోధనలతో సమాంతరంగా ఉన్నాయి. రష్యా వాటిని రాష్ట్ర స్థాయిలో ప్రాధాన్యత ఇచ్చి ముందుకు తీసుకెళ్తోంది. ఈ ప్రాజెక్టును పుతిన్ కుమార్తె, ఎండోక్రైనాలజిస్ట్ మరియా వొరొంత్సోవాకు అప్పటించారు. ఆమె నేతృత్వంలోని జన్యు పరిశోధనలతో అనుసంధానించారు. ఆమె రాష్ట్ర జన్యు కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు. ఇది వ్యక్తిగత ఆసక్తిని రాష్ట్ర విధానంగా మార్చడానికి సహాయపడింది. ఈ ప్రాజెక్టు ఆశావాదాన్ని కలిగిస్తుంది. జీన్ థెరపీ, రీజెనరేటివ్ మెడిసిన్ వంటి రంగాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. అవయవాల మార్పిడి ద్వారా జీవితకాలం పొడిగించడం సాంకేతికంగా సాధ్యమవుతుంది, కానీ పూర్తి అమరత్వం ఇప్పటికీ శాస్త్రీయంగా దూరంలోనే ఉంది. అవయవాల తిరస్కరణ, జన్యు మార్పుల భద్రత, జంతు ప్రయోగాల నైతికత వంటి సవాళ్లు ఉన్నాయి. ఇలాంటి అధునాతన చికిత్సలు మొదట్లో సంపన్నులు లేదా శక్తివంతులకు మాత్రమే అందుబాటులోకి రావచ్చు. ఇది సామాజిక అసమానతలను పెంచవచ్చు. అలాగే, జంతువులను ఉపయోగించి అవయవాలు పెంచడం వల్ల నైతిక చర్చలు రావచ్చు. రష్యాలో ఆయుర్దాయం తగ్గుతున్న నేపథ్యంలో ఈ ప్రయత్నం సానుకూలం. అయితే, యుద్ధం నేపథ్యంలో ఈ భారీ నిధులు ఇతర సామాజిక--ఆర్థిక అవసరాలకు ఉపయోగపడాలని విమర్శలు వస్తున్నాయి. చైనాతో సహకారం సాధ్యమైతే బయోటెక్నాలజీ రంగంలో రష్యా--చైనా బలం పెరగవచ్చు. ప్రపంచవ్యాప్తంగా ఇలాంటి పోటీ పెరగడం వల్ల మానవాళికి మంచి చికిత్సలు వచ్చే అవకాశం ఉంది. ఈ అభివృద్ధులు శాస్త్రం ఎంతవరకు మానవ సామర్థ్యాలను విస్తరించగలదో చూపిస్తాయి. ఫలితాలు ఏమైనా, ఇవి మానవాళి ముందుకు సాగడానికి ఒక ముఖ్యమైన అధ్యాయం.

# నలుగురు లబ్ధిదారులకు షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

## ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి: ప్రజాప్రతినిధులు.

**అర్జున్ సమాచారం జులై 10 మంచిర్యాల ప్రతినిధి:**

తెలంగాణ రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ఆశీస్సులు, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ ప్రోత్సాహంతో శుక్రవారం జైపూర్ తహసీల్దార్ కార్యాలయంలో షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఇందారం గ్రామానికి చెందిన రుక్సానా--ఫిరోజ్ ఖాన్, హబీబ్ ఖాతూన్--ఖాజా పాషా, హామీద్ బేగం--మహమ్మద్ సలీం, సమీనా బేగం--మహమ్మద్ సాబీర్‌కు తహసీల్దార్ వనజారెడ్డి చేతుల మీదుగా చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇందారం గ్రామ సర్పంచ్ మహమ్మద్ ఫయాజొద్దీన్, ఉపసర్పంచ్ ఎల్కటూరి శివ పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హుల జీవితాల్లో ఆర్థిక భరోసా కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రతి అర్హ కుటుంబం ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు బేధ లాస్య ప్రసాద్, జైపూర్ మండల కాంగ్రెస్ కార్యదర్శి ఎం.డి. జైనొద్దీన్, గౌస్, సద్దాం, సైఫ్, యువ నాయకుడు చిప్పకుర్తి సతీష్, పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.



Printed, Published and Owned by LINGAM RAJAIAH, and Printed at Vijaya Lakshmi Printing Press , H.No.12-180, Gouthaminagar,Mancheria, Mancherial Telangana-504208, and Published at H.No.12-180, Gouthami-nagar,Mancheria,Mancherial Telangana-504208. Editor: LINGAM RAJAIAH. PRGI. No. TGTEL/25/A5314, lingamrajaiahmncl@gmail.com,8121319896.